

Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 15.01.2016, శుక్రవారం
సంపుటి : 35 సంచిక : 33
పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com






## జిల్లా దేశంలో...

# కనిపించని 'ఆనం'దం

- అన్నల వెంట నడవని ఆనం తమ్ముళ్ళు
- అనుచరులను కట్టడి చేస్తున్న తెలుగు నేతలు
- సహకరించని దేశం ఇన్‌ఛార్జిలు
- పార్టీలో కుదరని సర్దుబాట్లు

**రాజకీయాలలో చంద్రబాబుతో పాటు ఆనం సోదరులు కూడా మాస్టర్ డిగ్రీలు చేసినవాళ్లే! కాకపోతే ఎన్టీఆర్ లాంటి మామ దొరకబట్టి చంద్రబాబు సీఎం అయ్యాడు. సోనియాగాంధీ లాంటి అతితెలివి నేత కాంగ్రెస్ అధినేత్రిగా వుంది కాబట్టి ఏ గతీ లేక ఆనం సోదరులు కాంగ్రెస్‌ను వదిలి చంద్రబాబు వద్దకు పోవాల్సి వచ్చింది.**

నెల్లూరుజిల్లా నుండి ఆనం సోదరులను తెలుగుదేశంలోకి చేర్చుకుంటున్నాడంటే చంద్రబాబు వద్ద ఓ థియరీ ఉంటుంది. ఓ లెక్క వుంటుంది. వీళ్ల వల్ల పార్టీకి అదనంగా వచ్చే ప్రయోజనంపై ఓ అంచనా ఉంటుంది. మనసు చంపుకుని తెలుగుదేశంపార్టీలో చేరారంటే ఆనం సోదరులకు కూడా ఓ లెక్క వుంటుంది. భవిష్యత్‌పై ప్రణాళిక ఉంటుంది. ఇప్పుడు చంద్రబాబు అంచనాలకు అనుగుణంగా ఆనం సోదరుల బలం, బలగం మ్యాచ్ కావాలి. దానికి వేదికే విజయవాడ. ఈ నెల 17న నెల్లూరు నుండి స్పెషల్ ట్రైన్, బస్సులను పెట్టి ఆనం సోదరులు తమ అనుచరులను విజయవాడ తీసుకెళుతోంది చంద్రబాబు అంచనాలను నిజం చేసేందుకే! తమ బల ప్రదర్శనకు వాళ్లు బెజవాడను ఎంచుకున్నారు.

ఎవరికైనా అనుమానం రావచ్చు. ఆనం బ్రదర్స్ ఎలాగూ పార్టీలో చేరిపోయారు. ఇక అనుచరులదేముంది... చంద్రబాబు నెల్లూరొచ్చినప్పుడు వాళ్ల అనుచరులను పార్టీలో చేర్చుండొచ్చు కదా... ఈ షో అంతా ఎందుకనే అనుమానాలు రాకమానవు. చంద్రబాబు నెల్లూరొచ్చినప్పుడు ఎన్ని వేలమంది జనం వచ్చినా, వారిలో ఆనం కోసం వచ్చిన వాళ్లున్నా అది చంద్రబాబు ఖాతాలోకే పోతుంది గాని, ఆనం ఖాతాలోకి రాదు. అదీగాక నెల్లూరులో సభ పెట్టి జనాలను తరలించడానికి ఆనం వాళ్లే అవసరం లేదు. కిలారి వెంకటస్వామి నాయుడు, కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి లాంటి నాయకులు వాహనాలను ఏర్పాటు చేసినా వస్తారు. మరి ఆనం వారి బలం ప్రత్యేకంగా తెలియాలంటే వారి కోసం జనం ఎక్కడికైనా వస్తారురా అని చూపించుకోవాలి.

(మిగతా 11వ పేజీలో)

## పక్షుల కిలకిల... తీరం కళ కళ...

7లో






## ఆక్రమణల తొలగింపు

# సాధ్యమయ్యేనా?



- మంత్రికి ఇది సవాలే...

**నవంబర్‌లో వచ్చిన వరదలు నెల్లూరు నగరంలో ఓ పెద్ద మార్పుకు శ్రీకారం చుట్టాయి. అప్పటి వరకు ఆక్రమణల విషయంలో మనం ఒక కోణాన్నే చూసాము. పంట కాలువల ఆక్రమణల వల్ల పారుదల తగ్గిపోయి ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోతుందని, తద్వారా దోమలు ప్రబలి డెంగీ, చికున్‌గున్యా, మలేరియా వంటి విషజ్వరాలు వస్తున్నాయని తెలుసు. అయితే జ్వరాలకు జనం అలవాటు పడిపోయారు కాబట్టి ఆక్రమణల సమస్యను పెద్దగా పట్టించుకోలేదు.**

అయితే ఆక్రమణల మూలంగా వచ్చే సమస్యల్లో రెండో కోణాన్ని మొన్న వరదల్లో చూసాము. పంట కాలువల ఆక్రమణల వల్ల నగరంలోని పలు కాలనీలు జలదిగ్భంధంలో చిక్కుకున్నాయి. నగరంలో వున్న ఆ కాలనీలలో పడవలు వేసుకుని తిరగాల్సి వచ్చింది. దాదాపు నాలుగైదు రోజులు పలు కాలనీలు నీళ్లలోనే వుండగా పోలీసు సిబ్బంది పడవల్లో వెళ్లి బాధితులకు ఆహారం, మంచినీళ్లు అందించారు.

పరిస్థితి ఇంత తీవ్రంగా ఉండబట్టే వరద ప్రాంతాలను పరిశీలించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పంటకాలువల ఆక్రమణల

(మిగతా 11వ పేజీలో)

### రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో

# విజేత..నెల్లూరు



కడప జిల్లాలోని రైల్వేకోడూరు మండలం కె.బుడుంగుంటపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని క్రీడామైదానంలో రెండురోజుల పాటు జరిగిన రాజీవ్‌గాంధీ ఖేల్ అభియాన్ రాష్ట్రస్థాయి అండర్-16 కబడ్డీ పోటీల్లో బాలుర విభాగంలో నెల్లూరుజిల్లా జట్టు విజేతగా నిలిచింది. సోమవారం జరిగిన ఫైనల్స్‌లో గుంటూరుపై నెల్లూరు జట్టు విజయం సాధించింది. విజేతగా నిలిచిన నెల్లూరుజట్టుకు శాప్ డైరెక్టర్ జయచంద్ర, డి.డి దేవానంద్, డిఎస్‌డిఓ బాషామొహిద్దీన్‌లు బహుమతులు ప్రదానం చేశారు. విజేతలను అందరూ అభినందించారు.

# మెట్ట ప్రాంతాలకో వరం.. సోమశిల

- ఎమ్మెల్యే మేకపాటి గౌతంరెడ్డి



జిల్లాలోని మెట్టప్రాంతాలైన ఉదయగిరి, వింజమూరు, అనంతసాగరం, మర్రిపాడు, దుత్తలూరు తదితర మండలాలకు సోమశిల జలాశయం ఒక వరంలాంటిదని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి గౌతంరెడ్డి అన్నారు. ఇటీవల ఆయన అనంతసాగరం మండలంలోని సోమశిల, పడమటి కంభంపాడు గ్రామాల్లో జరిగిన జన్మభూమి సభల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటు ఈ ప్రాంతాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు, అటు పంటలకు సాగునీటిని అందించేందుకు సోమశిల ఎంతో ఉపయోగ పడుతోందన్నారు. ఈ జలాశయం హైలెవల్ కెనాల్ పనులు మంజూరై పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. పేదల అభ్యున్నతే ధ్యేయంగా అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక అధికారులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

### నకిలీ మద్యం కేసులపై

# సిఐడి ఆరా

జిల్లాలో నకిలీ మద్యం కేసులను తిరిగి విచారించాలని ఇటీవల ముఖ్యమంత్రి ఆదేశించడంతో, ఈ కేసులకు సంబంధించిన పూర్తి వివరాలను రాబట్టేందుకు సిఐడి విభాగం ఆరా తీస్తోంది. ఈ కేసుల విచారణ వేగవంతం చేయాలని సిఐడి ఎస్పీ అమ్మిరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ నెల 9న ఆయన నగరంలోని సిఐడి అధికారులతో సమావేశమై, ఎన్నికల సమయంలో నమోదైన మద్యం కేసులపై పున:సమీక్ష నిర్వహించారు. జిల్లాలో నకిలీ మద్యం కేసులు ఎన్ని నమోదయ్యాయి?..ఏ ప్రాంతాల్లో ఆ కేసులున్నాయి?..ఇవి ఏ పార్టీలపై, ఏ నాయకులపై ప్రభావం చూపాయన్న విషయాలపై ఆయన అధికారులతో చర్చించారు. ఈ కేసులకు సంబంధించి సమగ్రమైన సమాచారాన్ని వేగవంతంగా నిర్వహించాలన్నారు. సంబంధిత వ్యక్తులకు సంబంధించి నివేదికలు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఎస్‌పిలు వెంకటేశ్వరరావు, ముస్తఫా, ప్రకాశరావు, పలువురు సిఐలు పాల్గొన్నారు.

### సంక్రాంతి పండుగలకు

# కార్పొరేషన్ భారీ ఏర్పాట్లు

సంక్రాంతి పండుగలను పురస్కరించుకుని నెల్లూరు నగరపాలక సంస్థ నగరంలో ఏర్పాట్లు ముమ్మరం చేసింది. 15వ తేదీన బోడిగాడితోట స్మశానంలో జరిగే పెద్దలపండుగకు, అదేవిధంగా 16న మైపాడుగేటు వద్ద జరిగే దేవుళ్ళ పండుగకు, 17న పెన్నానదిలో పెద్దఎత్తున జరిగే గొబ్బెమ్మలు, గాలిపటాల పండుగ నిర్వహణలకు భారీ ఏర్పాట్లు చేసింది. పెద్దల పండుగకు సమాధుల వద్దకు వచ్చి పెద్దలను సంస్మరించుకునేవారికోసం స్మశానంలో షామియానాలు, బల్లలు-కుర్చీలు, మంచినీటి వసతి ఏర్పాటు చేస్తోంది. దేవుళ్ళ పండుగకు విద్యుత్‌దీపాలు సిద్ధం చేసింది. వేణుగోపాలస్వామినగర్ వద్ద జరిగే పారువేట ఉత్సవానికి, మైపాడు గేటు వద్ద జాఫర్ సాహెబ్ కాలువలో జరిగే స్వామివారి తెప్పోత్సవానికి అన్ని సన్నాహాలు పూర్తిచేసింది. ఈ పండుగల సందర్భంగా వేలసంఖ్యలో జనం ఆయా ప్రాంతాలకు తరలివస్తుంటారు కనుక, నగరపాలక సంస్థ ఈ ఏర్పాట్లన్నీ భారీగానే చేస్తోంది.

### కొత్త దాన్యం, కొత్తల్లుళ్లు, గంగిరెద్దులు, గాలి పటాలు, హరిదాసులు

# కళకళగా సంక్రాంతి పండుగ



దక్షిణాయణంలోని చలికి వీడ్కోలు చెబుతూ సూర్యుడి కొత్త వెలుగులకు స్వాగతం పలుకుతూ మూడురోజుల పాటు చేసుకునే పెద్దపండుగ ఎంతో సంబరంగా జరుపుకోవడం దక్షిణ భారతదేశంలోనే వస్తున్న ఆచారం. భోగి రోజు గజగజ వణికించే చలిని లెక్కచేయకుండా తలంటు పోసుకుని భోగిమంటలు వేసుకున్నారు. రంగవల్లులతో ముంగిళ్ళను అలంకరించారు. వాటి మధ్యలో గొబ్బెమ్మలను పెట్టి పూజలు నిర్వహించారు. ధనుర్మాసానికి దక్షిణాయణానికి ఆఖరిరోజు భోగి. ఈరోజున సాయంత్రం పిల్లలకు భోగిపళ్ళు పోసి పెద్దలు దీవించారు. 15వ తేదీ మకర సంక్రాంతి. సూర్యుడు ధనూ రాశిలోంచి మకర రాశిలోకి ప్రవేశించే సమయం. ఈ సంక్రమణం పుణ్య కాలంలో స్నానం చేయడం పుణ్యప్రదం. ఉత్తరాయణ పుణ్యకాల ఘడియల్లో నువ్వులు, బియ్యం కలిపి శివుడిని అభిషేకిస్తే మంచిదని చెబుతారు. 16వ తేదీ కనుమ పండుగ రోజున ఇళ్లలోని గదులన్నీ ధాన్యపు రాశులతో కళకళలాడుతాయి. పశు సంపదను లక్ష్మీదేవి ప్రతిరూపాలుగా భావించి పూజచేస్తారు. రైతులు పశువులను శుభ్రంగా కడిగి కొమ్ములకు, మూపురానికి పసుపురాసి, కుంకుమ బొట్లు పెట్టి పూలతో గంటలు అలంకరిస్తారు. కనుమ పండుగరోజు మినుములు తినాలనే సామెత ప్రకారం గారెలు తింటారు. 17వ తేదీ గొబ్బెమ్మల పండుగ. ఈ పండుగను పెన్నాతీరాన కులమతాలకు అతీతంగా జిల్లా నలుమూలల నుండి వేలాదిగా తరలివచ్చి గొబ్బెమ్మలకు పూజ చేసి పెన్నానదిలో నిమజ్జనం చేస్తారు. చిన్నా పెద్ద ఆనందోత్సాహాలతో గడుపుతారు.

# అభిమానుల మధ్య బీద జన్మదిన వేడుకలు




టిడిపి జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్రయాదవ్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. నెల్లూరులోని మినీ బైపాస్‌రోడ్డులోని టిడిపి జిల్లా కార్యాలయంలో జిల్లా తెలుగు యువత నాయకుడు శింగంశెట్టి రవిచంద్ర ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీద రవిచంద్ర కేక్ కట్ చేసి, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బెజవాడ ఓబులురెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, రమేష్‌రెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి, కిలారి వెంకటస్వామినాయుడు, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి తదితరులు పాల్గొని బీద రవిచంద్రకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా, స్థానిక గీతామయి వృద్ధాశ్రమంలో తెలుగుయువత నాయకులు జలదంకి సుధాకర్ ఆధ్వర్యంలో బీద జన్మదినవేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. నాయకులు ఓంప్రకాష్‌యాదవ్, బాలకృష్ణచౌదరి, డా.సిరాజ్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. బీద జన్మదినాన్ని పురస్కరించుకుని తెలుగు యువత జిల్లా ప్రచార కార్యదర్శి కొల్లూరు బాలకృష్ణచౌదరి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ నగర్‌లోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ డాక్టర్స్ సెల్ ఆధ్వర్యంలో స్థానిక మాగుంట లే-అవుట్‌లో వున్న బీద నివాసంలో వేడుకలు నిర్వహించారు. డాక్టర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా, టిడిపి సాంస్కృతిక విభాగం నాయకుడు దోర్నాల హరిబాబు సారధ్యంలో బీద జన్మదిన వేడుకలు జరిగాయి.

సింహపురి సమాచారం

### చిన్నారుల

# సందడే... సందడి

నెల్లూరు మూలాపేటలోని శ్రీ వేణు గోపాలస్వామి దేవస్థానంలో ఆదివారం నిర్వ హించిన వేషధారణ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు సందడి చేశారు. గోదాదేవి అలంకరణలో, చిన్ని కృష్ణుని వేషధారణలలో చిన్నారులు అందరిని ఆకట్టుకున్నారు. ధనుర్మాసం సందర్భంగా వైష్ణవాలయాల్లో సంప్రదాయ వేషధారణ పోటీలను నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు, 10మందిని ప్రత్యేక వస్త్రధారణలో విజేతలుగా ఎంపికచేసి 14వ తేదీ దేవస్థానంలో జరిగిన భోగి కల్యాణం సందర్భంగా బహుమతులు అందజేశారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికి జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా ప్రధానార్చకులు శ్రీనివాస అయ్యంగార్, విద్వాన్ వివిఎస్ వినోద్‌కుమార్‌లు వ్యవహరించారు. మేనేజర్ కృష్ణ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

### ఏపి టూరిజం హోటల్లో

# చీట్లాట బ్యాచ్ అరెస్ట్

నెల్లూరు నగర నడిబొడ్డున ఉండే హోటల్ పై ఆదివారం రాత్రి పోలీసులు దాడి చేసి 12మంది చీట్లాట బ్యాచ్‌ను అరెస్ట్ చేశారు. గత కొంతకాలంగా దర్గామిట్టలో వున్న ఏపి టూరిజం వారి హరిత హోటల్‌లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయనే సమాచారం రావడంతో నగర డిఎస్పీ జి.వెంకటరాముడు ఆధ్వర్యంలో డిఎస్పీ ఐడి పార్టీ సిబ్బంది నిఘాపెట్టారు. ఆదివారం రాత్రి హోటల్‌లోని ఓ రూంలో డిఎస్పీ ఆధ్వర్యంలో అయిదవ నగర ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారావు, ఎస్సైలు జగత్‌సింగ్, విజయ కుమార్, సిబ్బంది దాడి చేశారు. ఈ దాడిలో చీట్లాట ఆడుతున్న నెల్లూరులోని వివిధ ప్రాంతాలకు చెందిన 12మందిని అరెస్ట్ చేశారు. వారివద్ద నుంచి రూ.88వేలు నగదు, ఐదు బైక్‌లు, ఒక కారు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసులు నమోదు చేశారు. సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు, పేకాట తదితర అసాంఘిక కార్యక్రమాలు చేపడితే కఠినచర్యలు తప్పవని నగర డిఎస్పీ రాముడు హెచ్చరించారు.

# రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛభారత్

గూడూరు రైల్వేస్టేషన్‌లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు రైల్వే డివిజనల్ సీనియర్ మేనేజర్ వెంకటరావు అన్నారు. 9వ తేదీ స్థానిక రైల్వేజంక్షన్‌లో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛభారత్‌పై అవగాహన కల్పిస్తూ రైల్వే అధికారులు, సిబ్బంది ర్యాలీని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా రైల్వేశాఖ ప్రతి నెల ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ రైల్వేస్టేషన్, పరిసర ప్రాంతాలను శుభ్రపరుస్తున్నామన్నారు. అదేవిధంగా రైలు ప్రయాణీకులకు కూడా స్వచ్ఛభారత్‌పై అవగాహన కల్పించేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ పి.వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అద్భుతం.. అపూర్వం.. శ్రీవిద్యా మహాయాగం

## వందల ఏళ్ళ తర్వాత వేలాది మంది పాల్గొనే యోగం

**మహాయాగ క్రతువుల్లో ఎంతో మహిమాన్వితమూ.. పరమాద్భుతము అయిన శ్రీవిద్యా మహాయాగంతో కావేరీ తీరం భక్తి పారవశ్యంతో పులకించి పరవశించిపోయింది. వేద మంత్రాల మధ్య, మంగళవాయిద్యాల మధ్య..అశేష భక్తజనసందోహం మధ్య జగన్మాత అయిన శ్రీ లలితాంబికకు ఎంతో ప్రీతిపాత్రమైన శ్రీవిద్యా మహాయాగాన్ని నిర్వాహకులు కఠోరనిష్టతో.. ఎంతో భక్తిశ్రద్ధలతో ఆద్యంతం అద్భుతంగా నిర్వహించారు.**



లోక కల్యాణమే ధ్యేయంగా జరిగిన ఈ మహాయాగంతో ఛాయాపుర శక్తి పీఠం..ఒక భక్తిపీఠంగా అవతరించిన అనుభూతి భక్తులకు కలిగింది. ఈ సందర్భంగా, వేదమంత్రాలతో తిరుఇంగోయిమలై మార్మోగిపోయింది. నిరంతరం శ్రీ లలితాంబికనే సేవిస్తూ ఆ మహాదేవి మహిమాన్విత తత్వాన్ని–మహత్వాన్ని లోకానికి చాటుతున్న పరమ భక్తాగ్రేసరురాలు.. దైవాంశ సంభూతురాలైన శ్రీల శ్రీ మాతాశ్రీ యోగినీ శ్రీవిద్యాంబ సరస్వతి నేతృత్వంలో, శ్రీ లలితా మహిళా సమాజం ఆధ్వర్యంలో ఈ మహాయాగం జగజ్జేయమానంగా జరిగింది.

గత నెల 25 నుంచి ఈనెల 4వతేది వరకు తమిళనాడులోని తిరుచిరాపల్లి సమీపంలో వున్న తిరుఇంగోయిమలై పుణ్యక్షేత్రంలో, 50వ శక్తిపీఠంగా ప్రసిద్ధిచెందిన ఈ ఛాయాపుర శక్తిపీఠంలో జరిగిన ఈ మహాయాగం నభూతో న భవిష్యతి అనే చెప్పవచ్చు. సర్వమంత్ర స్వరూపిణి, సకల శుభప్రదాయిని అయిన శ్రీ లలితాంబిక ఆరాధనలో భాగంగా జరిగిన ఈ మహాయాగంలో విశేష విశిష్ట నిష్టాగరిష్టులైన ఎంతోమంది దేవీ ఉపాసకులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దీంతో తిరుఇంగోయిమలై భక్తజనప్రవాహంతో నిండిపోయింది.. ప్రపంచంలోనే అరుదైన మహత్తర–బృహత్తర యాగంగా ప్రసిద్ధి చెందిన ఈ మహాయాగ కార్యక్రమాలన్నీ ఆద్యంతం అద్భుతంగా అపూర్వంగా జరిగాయి.

- జగములనేలే జగన్మాతకు భక్తుల జేజేలు
- వేదమంత్రాలతో మార్మోగిన తిరుఇంగోయిమలై
- భక్తి పీఠంగా మారిన.. ఛాయాపుర శక్తిపీఠం
- ఆకట్టుకున్న నెల్లూరు కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు

ఈ యాగ కార్యక్రమాల్లో భాగంగా శ్రీలలితా మహాత్రిపుర సుందరికి విశేషమైన పూజలెన్నో నిర్వహించారు.గోమాత పూజ, సూర్య పూజ, గజపూజ, అశ్వపూజలతో ప్రారంభించి, నిత్య పూజలు, ప్రత్యేకసేవలు చేస్తూ నిత్యం ఉపాసకులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. రంగురంగుల విద్యుద్దీపాలంకరణలతో యాగవేదిక ప్రాంగణమంతా కాంతివంతం చేశారు. ప్రత్యేక యాగకుండాలు ఏర్పాటు చేసి యాగ ప్రాంగణాన్నంతా మహా మహిమాన్వితమైన ఒక పెద్ద యాగశాలగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా జగజ్జనని శ్రీ లలితాంబిక అమ్మ వారిని సువర్ణాభరణాలతో.. సుగంధ భరితమైన పుష్పాలతో అత్యంత శోభాయమానంగా అలంకరించారు. వేదమంత్రాలతో విశిష్టమైన పూజలు చేశారు. అంగ, ఉపాంగ, ప్రత్యంగ దేవతలను విశేషారాధనలతో అర్చించారు. శ్రీ లలితా మహా త్రిపుర సుందరి న్యాసక్రమాన్ని, శ్రీవిద్యా సంప్రదాయ పరంపర గురుమండల పూజలను సంప్రదాయ బద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పరమపావనమైన కావేరీ నదీ జలాలను తీసుకువచ్చి అమ్మవారికి సపర్యపూజలు నిర్వహించారు. కలశస్థాపన చేసి అభిషేకం చేశారు. శ్రీ లలితా సహస్ర నామాలను ప్రతిరోజూ పఠించి గణపతి, సుబ్రహ్మణ్యం, శ్యామల, బాలా, వారాహి లలిత పూజలను హోమాలను క్రమబద్ధంగా నిర్వహించడంతో పాటు నవావరణ పూజలు అత్యంత నిష్టతో నిర్వహించారు. అమ్మణ్ణిని భక్తిశ్రద్ధలతో కొలుస్తూ నిర్వహించే మహాయాగ క్రమారాధ్య పద్ధతిని అనుసరించి సంప్రదాయబద్ధంగా వరుసక్రమం తప్పకుండా అన్ని పూజలు విశేషరీతిలో జరిగాయి. సర్వమంగళప్రదాత, జగన్మాత అయిన ఆ శ్రీ లలితాంబికను అనుక్షణం ఆరాధిస్తూ ఈ మహా యాగాన్ని ఇంత మహత్తర.. బృహత్తరంగా.. లోకోత్తరంగా నిర్వహించడం ప్రపంచంలోనే అరుదైన విషయమని భావిస్తున్నారు. పరమ పవిత్రమైన, మహిమాన్వితమైన ఈ మహాయాగానికి దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖ స్వామీజీలు కూడా విచ్చేశారు. పూజనీయ పరమహంస పరివ్రాజక ఆచార్య స్వామి నిరంజనానంద సరస్వతి (బీహార్), పూజనీయ శ్రీ జయేంద్రపురి స్వామీజీ (కర్నాటక), శ్రీ మహామేధానంద సరస్వతి(ఒరిస్సా)లతో పాటు పుదుచ్చేరి ముఖ్యమంత్రి శ్రీ ఎన్.రంగస్వామి, కేంద్రమంత్రి శ్రీ రాధాకృష్ణన్ సహా అనేకమంది ప్రముఖులు పాల్గొన్నారు. సమాజంలో మంచిని– మానవత్వాన్ని పెంపొందించి ఎల్లెడలా భక్తి తత్పరతను ద్విగుణీకృతం చేయాలనే సదాశయంతో, విశ్వశ్రేయస్సే పరమావధిగా భావించి, మానవ జీవితాలకు పరిపూర్ణతను చేకూర్చాలనే ఆశయంతో ఈ మహాయాగాన్ని అద్యంతం అద్భుతంగా నిర్వహించిన శ్రీలశ్రీ మాతాశ్రీ యోగిని శ్రీ విద్యాంబ సరస్వతి అనితర సాధ్యమైన కృషి, శ్రీలలితా మహిళా సమాజంవారి అకుంఠిత కార్యదీక్షా దక్షత ఈ సందర్భంగా అందరి ప్రశంసలకు పాత్రమైంది. కాగా, పదిరోజుల పాటు జరిగిన ఈ మహా యాగ కార్యక్రమంలో వేలాదిమంది భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం స్వీకరించగా, చివరి రెండు రోజుల్లోనే దాదాపు 20వేల మంది పాల్గొనడం విశేషం.

### లలితా సహస్రనామాల అర్థంతో కూడిన ఆంగ్లపుస్తకం ఆవిష్కరణ:

శ్రీ లలితా సహస్రనామాలను సంస్కృతం నుండి తమిళంలోకి శ్రీ ల మాతాజీ అనువదించగా ఆ వేయి నామాల అర్థాన్ని పాండిచ్చేరి ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి, మన నెల్లూరుజిల్లా వాసి ఇందుకూరు వసంతకుమార్‌రెడ్డి అర్ధాంగి పద్మినీ వసంత కుమార్‌రెడ్డి తమిళం నుండి ఆంగ్లంలోకి అనువదించి ముద్రించిన గ్రంథాన్ని మాతాజీ ఆవిష్కరించి తొలిప్రతిని 'లాయర్' పత్రిక సంపాదకులు ప్రభు దంపతులకు అందజేశారు.

### ఆకట్టుకున్న నెల్లూరీయుల సాంస్కృతిక ప్రదర్శనలు:



ఈ మహాయాగం సందర్భంగా నెల్లూరీయుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. గత నెల 30,31 తేదీల్లో జరిగే శాస్త్రీయ సంగీత విభావరిలో 'సంకీర్తన కోకిల', ప్రముఖ గాయని జె.బాలార్క మధుర గానం అందరినీ ఆకట్టుకుంది. శాస్త్రీయ నృత్యాల్లో ప్రసిద్ధిచెందిన శ్రీ గురుకృప కళాక్షేత్రం అధినేత్రి సురభి గాయత్రి పర్యవేక్షణలో చిన్నారులు ఏ.తేజస్విని, బి.కళాంజలి, ఇ.వినీల, ఇ.వెన్నెల, ఐ.సాయిప్రీతి, పి.నిఖితాంజలి, డి.తనుశ్రీ, డి.శ్రీజ పాల్గొని తమ అద్భుతమైన భరత నాట్యం, కూచిపూడి నృత్యాలతో అందరినీ మంత్రముగ్ధులను చేశారు. అదేవిధంగా 'వీణ త్రయం'గా పేరొందిన శ్రీమతి హేమలక్ష్మి పాలేటి, శ్రీమతి పి.పద్మాచక్రవర్తి, శ్రీమతి ఎస్.నాగలక్ష్మి ఈ మహాయాగ మహోత్సవంలో పాల్గొని తమ కళాప్రతిభను చాటుకున్నారు. మృదంగం కళా కారుడు కళాధర్, వయోలిన్‌పై రవిశంకర్, ఘటంపై నాగరాజు వీరికి సహ వాయిద్యాలతో సహకరించారు.





పద్మిని - వసంత కుమార్ దంపతుల సమక్షంలో పుస్తకం తొలి ప్రతిని ప్రభు దంపతులకు అందజేస్తున్న మాతాజీ







అద్భుత నాట్యాభినయం చేస్తున్న గురుకృప చిన్నారులు

# జర్మనీలో విద్య-ఉపాధికి ఎన్నో అవకాశాలు

**- అవగాహన సదస్సులో వక్తలు**



జర్మనీ దేశంలో విద్యకు–ఉపాధికి ఎన్నో అవకాశాలున్నాయని కెసిఆర్ కన్సల్టెంట్స్ (చెన్నై) ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ కె.సి రాజన్ వెల్లడించారు. నెల్లూరులోని డిఆర్ ఉత్తమ్ హోటల్‌లో కెసిఆర్ కన్సల్టెంట్స్ వారి ఆధ్వర్యంలో ఇటీవల 'జర్మనీలో విద్య ఉపాధి అవకాశాలు' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, తమ సంస్థ ద్వారా గత 15 సంవత్సరాల్లో ఎంతోమంది విద్యార్థులు జర్మనీలో ఉన్నత విద్యను అభ్యసించారని, వారంతా మంచి ఉద్యోగాలలో స్థిరపడ్డారని తెలిపారు. జర్మనీలోని విశ్వవిద్యాలయానికి చెందిన ప్రతినిధి మిస్ క్రిస్టీనా స్టీఫెన్స్ మాట్లాడుతూ జర్మనీలో చదువుకునేందుకు, మంచి ఉద్యోగాలు పొందేందుకు ఎన్నో అవకాశాలున్నాయన్నారు. కెసిఆర్ కన్సల్టెంట్స్ బెంగుళూరు, నెల్లూరుశాఖల ప్రతినిధి భానుప్రకాష్ మాట్లాడుతూ, జర్మనీలో విద్యను అభ్యసించేందుకు తమ సంస్థ అందించే సేవలను పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. ముఖ్యఅతిథిగా ప్రఖ్యాత శాస్త్రవేత్త, ప్రత్యామ్నాయ ఇంధన వనరుల నిపుణుడు డాక్టర్ ఏ.జగదీష్ పాల్గొనగా, విఆర్ కాలేజీ ఫిజిక్స్ విభాగాధిపతి డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం సంధానకర్తగా వ్యవహరించారు. ప్రపంచ తెలుగు సమాఖ్య రీజినల్ కో–ఆర్డినేటర్ నలుబోలు బలరామయ్య నాయుడు, బివి నరసింహం, 'కోకిల' రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## 'ప్రభా'తం

ఎట్టకేలకు నవ్యాంధ్రకు మంచిరోజులు రానున్నాయి. కన్నీళ్లను తుడుచుకుని.. కష్టాల నుంచి కలదేరుకుని, గుండె ఉగ్గబట్టుకుని ఎంతో సంయమనంతో నవ్యాంధ్ర ప్రగతిరథం మెల్లగా అభివృద్ధివైపుకు కదులుతున్న దృశ్యం ఇప్పుడిప్పుడే అందరి మనోనేత్రాలకు దృగ్గోచరమవుతోంది. విభజనతో అస్తవ్యస్తమైన రాష్ట్రం ఇక కోలుకుంటుందా?.. భారీ ఆర్థిక లోటుతో.. అప్పుల కుప్పలతో బయటపడిన రాష్ట్రం ఇక తిరిగి నిలబడుతుందా?.. అని అందరూ ఆవేదన చెందుతున్న సమయంలో విశాఖలో జరిగిన భాగస్వామ్య సదస్సు మంచి ఊరట కలిగిస్తోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో జరిగిన ఈ సదస్సులో నవ్యాంధ్రకు కొత్త కాంతులు తెచ్చేవిధంగా పారిశ్రామికవేత్తలు భారీ పెట్టుబడులతో ముందుకు రావడం ఎంతో శుభపరిణామం. విభజనతో పాలన కుంటుపడి, కనీసం రాజధాని కూడా లేక దిక్కులేని పక్షిలా.. ఆకాశపుటెడారిలో కాళ్ళుతెగిన ఒంటరి ఒంటెలా వున్న రాష్ట్రానికి తిరిగి పూర్వవైభవం తెచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మరోవైపు కేంద్రప్రభుత్వం చేస్తున్న కృషి సత్ఫలితాల దారిలో వుండడం సంతోషకరం. ఆదివారం విశాఖపట్నంలో ప్రారంభమైన సిఐఐ-భాగస్వామ్య సదస్సు నవ్యాంధ్రకు 'చంద్ర'కాంతులు తెచ్చిపెట్టిందంటే అతిశయోక్తి కాదు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో జరిగిన ఈ సదస్సులో నవ్యాంధ్రలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు, పారిశ్రామికంగా రాష్ట్రాన్ని ప్రగతి పథంలో పరుగులు తీయించేందుకు దేశ విదేశాలకు చెందిన అనేకమంది దిగ్గజాలైన పారిశ్రామికవేత్తలు సంసిద్ధతను వ్యక్తం చేయడం, రాష్ట్రంలో పారిశ్రామిక వెలుగులు నింపేందుకు నిర్ణయాలు జరగడం నవ్యాంధ్రకు కలిసివచ్చిన అదృష్టమనే చెప్పాలి. మూడు రోజులపాటు జరిగే ఈ భాగస్వామ్య సదస్సులో తొలిరోజు ఒప్పందాల విలువే 1,95,457 కోట్లు కావడం అద్భుతాల్లోకెల్లా అద్భుతం. ఆ మేరకు 32 ఒప్పందాలపై రాష్ట్ర ప్రభుత్వం సంతకాలు చేయడం, ఇందులో 20 ఒప్పందాల దాకా విద్యుదుత్పత్తి రంగానికి చెందిన ఒప్పందాలుండడం విశేషమే. ఎవరూ ఊహించనివిధంగా ఇంత భారీస్థాయిలో పెట్టుబడులను ఆకర్షించగలగడం నవ్యాంధ్ర ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు, తిరిగి రాష్ట్రం పూర్వవైభవం సాధించేందుకు ఇదో సువర్ణావకాశమేననవచ్చు. 5వేల కోట్లతో రక్షణ నౌకల నిర్మాణ కేంద్రాన్ని ఏర్పాటుచేయడానికి ప్రముఖ పారిశ్రామిక దిగ్గజం అనిల్ అంబానీ సారధ్యంలోని ఏడిఏ గ్రూపు ముందుకు రావడం విశేషం. విశాఖపట్నం జిల్లాలోని రాంబిల్లి వద్ద రిలయన్స్ ఏడిఏజి సంస్థ ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఈ నౌకానిర్మాణ కేంద్రాన్ని ప్రారంభించేందుకు ఆ సంస్థ అధినేత అనిల్ అంబానీ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. అదేవిధంగా రూ.1200 కోట్లతో నెల్లూరుజిల్లాలో ఆటో విడిభాగాల తయారీ కేంద్రాన్ని నెలకొల్పేందుకు భారత్ ఫోర్జ్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకోవడం నెల్లూరు జిల్లాకో వరం లాంటిది. ఈ ప్లాంట్ ఏర్పాటు వల్ల జిల్లాలో ప్రత్యక్ష, పరోక్షంగా కనీసం ఆరువేల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. అదే కాక, ఈ జిల్లాలోనే మరో సంస్థ వెయ్యి కోట్లతో విండ్ పవర్‌కు సంబంధించిన పరికరాల తయారీ ప్లాంట్‌కు కూడా ఒప్పందం చేసుకోవచ్చని భావిస్తున్నారు. అదేవిధంగా, అనంతపురం జిల్లాలో రక్షణ, ఏరోస్పేస్ తయారీకేంద్రం ఏర్పాటుకు భారత్ ఫోర్జ్ సంస్థ ముందుకు రావడం ఆ జిల్లా పారిశ్రామికాభివృద్ధికి ఎంతో చేయూతనిచ్చినట్లే. ఇలా ఎన్నో పారిశ్రామిక ఒప్పందాలు జరుగుతుండడం మొత్తంగా రాష్ట్రాభివృద్ధికి దారులు తీసినట్లే. కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ, కేంద్ర వాణిజ్యమంత్రి నిర్మలా సీతారామన్‌లు విశాఖకు విచ్చేసి పలు దేశాల పారిశ్రామిక దిగ్గజాలతో సమావేశమై ద్వైపాక్షిక వాణిజ్య పరమైన అంశాలను చర్చించడం, మరోవైపు కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి పీయూష్‌గోయల్ సమక్షంలో విద్యుత్ రంగానికి సంబంధించిన పలు ఒప్పందాలు జరగడం రాష్ట్రంలో పారిశ్రామిక వెలుగులతో పాటు విద్యుత్‌కాంతులు మరింతగా ద్విగుణీకృతమయ్యేందుకు అనువైన మార్గాలు సుగమమైనట్లేనని భావిస్తున్నారు. ఆదివారం ఒక్కరోజునే జరిగిన ఒప్పందాలన్నీ ఆచరణలోకి వస్తే సుమారు 95 వేల మందికి ఉపాధి అవకాశాలు లభ్యమవుతాయని అంచనా. మూడురోజుల్లో ఎన్నెన్నో ప్రముఖ కంపెనీలు మనరాష్ట్రంతో మరిన్ని ఒప్పందాలు కుదుర్చుకోనున్నాయి. ఇవన్నీ భవిష్యత్తులో రాష్ట్ర ప్రగతికి దివిటీలా భాసిస్తాయని భావించవచ్చు. రాష్ట్రానికి పెట్టుబడులు భారీగా వస్తున్న నేపథ్యంలో నవ్యాంధ్ర ప్రగతికి ఇక ఢోకా వుండకపోవచ్చని, రాష్ట్రాభివృద్ధికి ఇది స్వర్ణ సోపానమని చెప్పవచ్చు. పొడవైన సముద్రతీరం, అవసరమైన చోటల్లా పోర్టులు, కొరత లేకుండా వున్న భూములు, చక్కనైన వనరులు.. అన్నిటికీ మించి మంచి సుప్రశాంత వాతావరణం నవ్యాంధ్రకు ఇవన్నీ పెట్టని ఆభరణాలే. ఆ వనరులే ఇప్పుడు అన్నివిధాలా అభివృద్ధికి తగ్గ పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయి. మంచి వనరులు..అందుకు తగ్గ కృషి కూడా వుండడం, అటు రాష్ట్రం ఇటు కేంద్రం నవ్యాంధ్ర ప్రగతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తుండడం మంచి ఫలితాలనే ఇస్తోంది. కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ అన్నట్లు.. దేశాభివృద్ధికి ఇంజన్ ఆంధ్రప్రదేశ్ అనీ, ఈ రాష్ట్ర వృద్ధి రేటు భారత్ వృద్ధి రేటు పెరగడానికి గణనీయంగా తోడ్పడుతుందనీ అన్న మాటలు అక్షరసత్యాలు. విభజన తర్వాత నష్టపోయిన ఏపీని ఆదుకునేందుకు కేంద్రం సిద్ధంగా వుందన్నారు కూడా.

ఏదేమైనా, నవ్యాంధ్ర తిరిగి ప్రగతిలో రాణించాలి... మళ్లీ గతవైభవం తిరిగి రావాలన్నదే ప్రజలందరి ఆకాంక్ష. అందుకు అటు అద్భుతమైన వనరులు.. ఇటు ధీటైన నాయకత్వం రెండూ కలిసివచ్చిన అదృష్టాలే అనుకోవచ్చు. ఈ భాగస్వామ్య సదస్సుతో రాష్ట్రానికి అసలైన సంక్రాంతి వెలుగులతో పాటు.. పారిశ్రామిక కళ కూడా వచ్చినట్లయిందనే భావించవచ్చు.

### నవ్యాంధ్రకు కొత్త ఆశలు



నవ్యాంధ్రలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు దేశ విదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు సంసిద్ధతను వ్యక్తం చేయడం నవ్యాంధ్రకు కలిసివచ్చిన అదృష్టమనే చెప్పాలి. మంచి వనరులు ఇక్కడ వుండడం నవ్యాంధ్రకు ఒక వరం. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో విశాఖలో జరిగిన భాగస్వామ్య సదస్సులో తొలిరోజు ఒప్పందాల విలువే 1,95,457 కోట్లు కావడం అద్భుతం. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ఆ మేరకు రాష్ట్రాభివృద్ధికి కృషిచేయడం సంతోషకరం. నవ్యాంధ్రకు పారిశ్రామిక కళ తెచ్చేందుకు మూడు రోజులు జరిగే విశాఖ సదస్సు ఒక మంచి ప్రారంభం కావడం ఎంతైనా శుభపరిణామం.

# జిల్లాలో 16న గోపూజ మహోత్సవాలు

**- టిటిడి ప్రత్యేక అధికారి ఆచార్య గార్లపాటి వెల్లడి**

తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో ఈ నెల 16న కనుమ పండుగను పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా గోపూజ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు టిటిడి సనాతన ధార్మిక జ్ఞానవిభాగం ప్రత్యేక అధికారి ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు తెలిపారు. ఈ నెల 9న ఆయన నెల్లూరులోని టిటిడి కల్యాణమండపంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భారతదేశం ఎంతో పవిత్రమైన ఆశయాలు కలిగిన దేశమన్నారు. గోవులను పూజించడం పుణ్యప్రదమన్నారు. గోవుల పవిత్రతను అందరూ తెలుసుకోవాలన్నారు. గోపూజతో పాటు గోవుల సంరక్షణకు అందరూ కృషి చేయాలన్నారు. గోవుల ప్రాధాన్యతను ప్రజలందరికీ తెలియజేయాలనే మహాసంకల్పంతో టిటిడి గోపూజ మహోత్సవాలకు సంకల్పించిందన్నారు. జిల్లాలోని 10 దేవస్థానాల్లో ఆ రోజున గోపూజ కార్యక్రమాలు వైభవంగా జరుగుతాయన్నారు. నెల్లూరు నగరంలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలోను, నెల్లూరు రూరల్‌లోని నరసింహకొండలో శ్రీ వేదగిరి నృసింహస్వామి ఆలయంలోనూ, అదేవిధంగా పెంచలకోనలో శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలోనూ, కావలిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి కోవెలలోనూ, జొన్నవాడలోని శ్రీ కామాక్షితాయి అమ్మవారి సన్నిధిలోనూ, అల్లూరులోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలోనూ, సర్వేపల్లి నియోజకవర్గంలో తలకూరులోని శ్రీరామ మందిరంలోనూ, గూడూరులో అలఘనాధస్వామి ఆలయంలోను, సూళ్లూరుపేటలో కుముదనేశ గోశాలలోనూ టిటిడి పర్యవేక్షణలో గోపూజ మహోత్సవాలు జరుగుతాయన్నారు. ఈ సమావేశంలో టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్ కో-ఆర్డినేటర్ మల్లెల శ్రీహరి, ధర్మప్రచారపరిషత్ మండలి అధ్యక్షుడు సివి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు కొండా శేఖరరెడ్డి, కార్యదర్శి వంజవాక ధనుంజయ, సభ్యులు డాక్టర్ వెంకటేష్, కొండేపి గిరిజాకుమారి పాల్గొన్నారు.

## కేంద్ర కారాగారాన్ని తనిఖీ చేసిన డిఐజి


నెల్లూరుజిల్లా కేంద్ర కారాగారాన్ని జైళ్ళ శాఖ డిఐజి జయవర్ధన్ ఆదివారం తనిఖీ చేశారు. జైలులో ఉన్న ఖైదీలు, వారికి అందించే వసతులను గురించి పరిశీలించారు. జైలులో వున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు, ఖైదీల ప్రవర్తన, రోజువారీ వారికందించే ఆహార పదార్థాలను పరిశీలించారు. జైలులో ఉండే సమస్యలపై ఆరా తీసారు. జైలు సూపరింటెండెంట్ రవికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## చోరీల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**ప్రజలకు డిఎస్పీ సూచన**

నేర నియంత్రణలో ప్రజలు భాగస్వాములు కావాలని, అప్పుడే పూర్తి స్థాయిలో నియంత్రణ సాధ్యమని నెల్లూరు నగర డిఎస్పీ వెంకటరాముడు పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇరానీ ముఠాలు జిల్లాలో పాగా వేశాయన్నారు. వృద్ధ మహిళలను గమనించి బంగారు ఆభరణాలను తీసిస్తే భద్రపరుస్తామంటూ నేరగాళ్ళు నమ్మించి మోసం చేస్తున్నారన్నారు. ఇలాంటి వారి మాటలకు మోసపోవద్దన్నారు. బ్యాంకుల్లో నగదు డ్రా చేసినప్పుడు దృష్టి మళ్ళించి దోపిడీలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. కొంతమంది నేరగాళ్ళు బంగారు ఆభరణాలకు మెరుగుపడుతున్నట్లు నమ్మించి వాటితో ఉడాయించే అవకాశం వుందన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఊళ్ళకు వెళ్లే వాళ్లు సమీపంలోని పోలీస్‌స్టేషన్లలో సమాచారం అందించాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనపడినా, ఆయా ప్రాంతాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నా 100, 1090, 0861-2328400 నంబర్లకు తెలియజేయాలన్నారు.

## కోడి పందేలు కూడా పండుగే!




ప్రపంచంలో జరిగే పలు అకృత్యాలతో పోల్చుకుంటే కోడిపందేలు చాలా చిన్నవి. ఆహారం కోసం నేల మీద కనిపించే ప్రతి జంతువును కోసుకుతింటున్నారు. ఐసిస్ వాళ్లు మనుషులను కూడా జంతువుల కంటే కిరాతకంగా చంపుతున్నారు. కొన్ని మతాల వాళ్లు పండుగలప్పుడు లక్షలాది జంతువులను బలి చేస్తున్నారు. పురాతన యజ్ఞాల్లోనూ బలులిచ్చేవాళ్లు. ఇన్ని అకృత్యాలతో పోల్చి చూస్తే కోడిపందేలు పెద్ద సమస్య కాదు. తమిళనాడులో జల్లికట్టుకు అనుమతినిచ్చినట్లే మన రాష్ట్రంలో సంక్రాంతి వరకు కోడి పందేలకు అనుమతివ్వాలి.

**- వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

### అసైన్డ్ నొక్కేస్తున్నారు

అసైన్డ్ భూములపై ప్రభుత్వ అజమాయిషీ ఉంటుంది. భవిష్యత్‌లో అవసరాలకు ఈ భూములు ఉపయోగపడుతుంటాయి. ఇప్పుడు ప్రభుత్వం అసైన్డ్ భూములకు కూడా ఎసరు పెట్టింది. ఈ భూములను క్రమబద్ధీకరిస్తే ప్రభుత్వ ఆధీనంలో భూములే మిగలవు.

**చట్టి రామనారాయణ, నెల్లూరు.**

### ఉగ్రవాదంపై యుద్ధం

ఇప్పుడు ప్రపంచానికి ఉమ్మడి శత్రువు ఉగ్రవాదం. దీనిని అంతమొందించడానికి ప్రపంచం ఏకం కావాలి. అన్ని దేశాల సైనికులతో కలిసి ఉగ్రవాదులపై యుద్ధానికి ఒక పెద్ద సైన్యాన్ని ఏర్పాటు చేయాలి. ఏ దేశంలోని ఉగ్రవాదులపై దాడికైనా ఈ సైన్యం వెళ్లాలి. ఐక్యరాజ్య సమితియే ఈ సైన్యం రూపకల్పనకు కృషి చేయాలి.

**పి. శాండిల్య, హైదరాబాద్.**

### ఏమి లింకు?

ప్రజలు, ఉద్యోగులు, రాజకీయ నాయకులు తమ బాధ్యత తెలుసుకొని పని చేస్తే దేశం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుంది. 'కోటు-టైతో కాదు బాధ్యత తెలుసుకొని పని చేయాలి' అని చంద్రబాబు జిల్లా కలెక్టర్లకు సలహా ఇచ్చారు. బాధ్యత తెలుసుకుని పని చేయడానికి కోటు - టైకు ఏమి లింకో?

**కురుగూరు రంగనాథం, నెల్లూరు.**

# వివాదాలకు కేరాఫ్... విక్రమ సింహపురి విశ్వ విద్యాలయం




***విజ్ఞానానికి కేంద్రంగా ఉండాల్సిన విద్యాలయం వివాదాలకు మూలకేంద్రమైంది. ఆందోళనలకు వేదికవుతోంది. విద్యార్థి సంఘాల ధర్నాలతో దద్దరిల్లుతోంది. ఉద్యోగుల నిరసనలతో మార్మోగుతోంది. నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో నెలకొన్న దుస్థితి ఇది. విద్యార్థులతో, విజ్ఞాన కాంతులతో వెలుగులీనుతూ వుండాల్సిన యూనివర్శిటీ నిత్యం వివాదాలతో రగిలిపోతోంది. పాలకవర్గాల అవినీతి, నిర్లక్ష్యం మూలంగా ఈ విశ్వవిద్యాలయం భ్రష్టు పడుతోంది.***

నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయానికి ఇంకా బాలారిష్టాలు తొలగలేదు. సమస్యలు తగ్గకపోగా నానాటికీ ఇక్కడ సమస్యలు పెరుగుతుండడం విద్యార్థులను ఆందోళనకు, ఆవేదనకు గురి చేస్తోంది. దివంగత నేత డాక్టర్ వై.యస్.రాజశేఖర రెడ్డి హయాంలో ప్రతి జిల్లాలోనూ ఒక యూనివర్శిటీని స్థాపించాలనే ఆశయంతో నెల్లూరు జిల్లాకు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయాన్ని మంజూరు చేయడం జరిగింది. యూనివర్శిటీ అన్నాక అప్పటికప్పుడు భవనాలు సమకూరవు కాబట్టి విఆర్ హైస్కూల్ పై భాగంలో తరగతులను నిర్వహిస్తూ, బారాషహీద్ దర్గా వద్ద వున్న ఆఫీసర్స్ క్లబ్‌ను యూనివర్శిటీ పరిపాలనా భవనంగా మార్చారు. ఈ తాత్కాలిక భవనాలలోనే కొన్నేళ్ల పాటూ సమర్ధవంతంగా యూనివర్శిటీని నెట్టుకొచ్చారు. ఆచార్య విశ్వేశ్వరరావు, ఆచార్య రాజారామిరెడ్డిలు ఉపకులపతులుగా పని చేసిన కాలంలో యూనివర్శిటీలో పెద్దగా వివాదాలొచ్చింది లేదు. వాళ్లు పద్ధతిగా పని చేసుకుంటూ పోయారు.

యూనివర్శిటీ నామ్స్ ప్రకారం వంద ఎకరాల విస్తీర్ణం వుండాలి. ఎల్‌కెజి నుండి పిజి వరకు క్లాసులు నిర్వహించాలి. ఇక విద్యార్థులకు హాస్టల్, క్రీడా మైదానం, ఆడిటోరియం వంటివి తప్పనిసరిగా వుండాలి. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో యూనివర్శిటీ నిర్మాణానికి ఆనం సోదరులు నెల్లూరురూరల్‌లోని కొత్తూరు వద్ద స్థలాన్ని ప్రతిపాదించారు. ఆరోజు వాళ్ల ఆలోచన వేరు. కొత్తూరు అయితే నెల్లూరురూరల్ పరిధిలోకి వస్తుంది. యూనివర్శిటీ తమ కంట్రోల్‌లో వుంటుందని వారి ఉద్దేశ్యం. కాని యూనివర్శిటీ నిర్మాణానికి ప్రతిపాదించిన కొత్తూరు భూములను ఆరోజు విశ్వవిద్యాలయ నిర్మాణానికి సంబంధించిన కమిటి తిరస్కరించింది. వాళ్లు వెంకటాచలం మండలంలోని కాకుటూరు వద్దే యూనివర్శిటీ నిర్మాణానికి మొగ్గు చూపారు. ఇది సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోకి వస్తుండడంతో ఆరోజు ఆర్థికశాఖ మంత్రిగా వున్న ఆనం రామనారాయణరెడ్డి యూనివర్శిటీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయలేదు. ఆ తర్వాత ఆదాల ప్రభాకర్‌రెడ్డి సీఎంగా వున్న కిరణ్ కుమార్‌రెడ్డిపై ఒత్తిడి తెచ్చి కాకుటూరు వద్ద యూనివర్శిటీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేయించగలిగాడు.

2014లో తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక ఈ భవనాల నిర్మాణం వేగంగానే జరిగింది. అయితే ఈ భవనాలు పూర్తయినా యూనివర్శిటీని అక్కడకు మార్చే ప్రయత్నాలు మాత్రం జరగడం లేదు. ఇదో ఎత్తైతే ప్రస్తుతమున్న వైస్‌ఛాన్సలర్, రిజిస్ట్రార్‌లు కేంద్రంగా యూనివర్శిటీలో పలు వివాదాలు రేగుతున్నాయి. ఇప్పుడున్న రిజిస్ట్రార్ కేవలం ఇన్‌ఛార్జ్ మాత్రమే. ఇన్‌ఛార్జిగా మూడు నెలలు లేదంటే ఆరు నెలల దాకా వుండొచ్చు. ప్రస్తుతమున్న ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్ వచ్చి ఒకటిన్నర ఏడాదయ్యింది. ఈ రిజిస్ట్రార్ గతంలో కావలిలో పనిచేసినప్పుడు అతనిపై అనేక ఆరోపణలొచ్చాయి. పూర్తిస్థాయి ఇన్‌ఛార్జ్‌లుగా నియమించడానికి అర్హులైన వాళ్లు చాలామందే యూనివర్శిటీ పరిధిలో వున్నారు. కాని ఉపకులపతి మాత్రం ప్రస్తుతమున్న ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్ శివశంకర్‌ను కొనసాగించాలనే చూస్తున్నారు. అందుకనే అతనికంటే సీనియర్లుగా వున్న ప్రొఫెసర్లను ఇటీవలే వివిధ విభాగాలకు బదిలీ చేశారు. ఈ బదిలీలు కూడా పెద్ద వివాదమయ్యాయి. ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్‌గా వున్న శివశంకర్ హయాంలో యూనివర్శిటీ అక్రమాలకు వేదికగా మారిందంటూ ఇటీవలకాలంలో రాజకీయాలకతీతంగా అన్ని విద్యార్థి సంఘాలు పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహిస్తున్నాయి. కాని ఉపకులపతి మాత్రం విద్యాశాఖ మంత్రినే ప్రసన్నం చేసుకుని తనకు విశ్వాసపాత్రుడిగా వున్న శివశంకర్‌ను పూర్తిస్థాయి రిజిస్ట్రార్‌గా పెట్టుకునే ప్రయత్నాలలో వున్నారు.

ఈ విశ్వవిద్యాలయం నెల్లూరుకు లభించిన విద్యావరం. దీనిని ఆదిలోనే గంజాయివనంగా మారుస్తారో లేక అక్రమాలనే గంజాయి మొక్కలను పీకేసి విద్యాపూలవనంగా మారుస్తారో... అంతా ప్రభుత్వం మీదే ఆధారపడి వుంది.

## విమానం ఎగరాలంటే... 300 కోట్లు కావాలి



నెల్లూరుజిల్లా దగదర్తి మండలంలోని దామవరం వద్ద ప్రతిపాదించిన ఎయిర్‌పోర్టు నిర్మాణానికి 293కోట్లు దాకా అవసరమవుతుందని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. ఇందుకు మొదటి దశలో 173కోట్లు ఖర్చవుతాయని లెక్కేసారు. వై.యస్. సీఎంగా వున్నప్పుడే దామవరం వద్ద ఎయిర్‌పోర్టు నిర్మించాలని తల పెట్టారు. ఈమేరకు 600 ఎకరాల దాకా భూ సేకరణ కూడా జరిగింది. దామవరం వద్ద ఎయిర్‌పోర్టు పెడితే నెల్లూరుజిల్లాతో పాటు ప్రకాశం జిల్లా వాళ్లకు కూడా దగ్గరగా వుంటుందని అంచనా! అప్పట్లో ఈ ఎయిర్‌పోర్టు పనులను మెటాస్ కంపెనీ తీసుకుంది. అయితే అప్పుడే 'సత్యం' కుంభకోణం వెలుగులోకి రావడం, మెటాస్ కంపెనీ వారిదే కావడంతో ఆ పని వెనక్కిపోయింది. 2009లో వై.యస్. మరణంతో ఈ ఎయిర్‌పోర్టు గురించి పట్టించుకున్న నాథుడు, నాయకుడు లేడు. ఇప్పుడు చంద్రబాబు ఆర్టీసీ బస్టాండ్‌ల మాదిరిగా ప్రతి జిల్లాలోనూ ఎయిర్‌పోర్టులు పెడతామంటూ వాగ్ధానాలు చేస్తున్నాడు. మరి దామవరం ఎయిర్‌పోర్టు నిర్మాణం ఎంత వరకు ఆచరణలోకి వస్తుందో చూడాలి.

DR. BEZAWADA GOPALA REDDY WOMEN'S ACADEMY
(A Degree college for women. Affiliated to V.S. University. - English Medium only)
Sri Kasturidevi Vidyalayam Campus, Dargamitta, Nellore - 524 003.
Ph : 0861 - 2326461, 0861 - 2321270, Cell : 93471 01780.



A NUMERO UNO :
- An Exclusive Private Women's College with an alluring ambience.
- A most sought after destination for women's education.
- An opportunity to secure merit scholarships.
- A safe place for women students.
- Training Technical & Soft Skills required by industry.
- Training for Campus Placement Mission (CPM) by JKC.
- An institution where skills latent are honed to full potential.
- A rotaract club to promote leadership dynamics.

Dr.T.Subbarama Reddy
Modernising
SRI RABINDRANATH TAGORE AUDITORIUM

Getting Ready to Qualify for NAAC Accreditation

WISH YOU ALL A HAPPY NEW YEAR AND SANKRANTI

COURSES OF STUDY
1. Maths - Physics - Computer Science
2. Maths - Statistics - Computers Science
3. Bio-Technology - Zoology - Chemistry
4. Bio-Technology - Chemistry - Computer Applications
5. B.Com Computer Applications

DR. B.G.R BECKONS TO A WORLD OF ACADEMIC EXCELLENCE

Secretary & Correspondent
SRI J.V. REDDY

YOUR DREAM DESTINATION : Sri Kasturidevi Vidyalayam Campus, Nellore -3.

# సింహపురి సీమలో పందుల రాజ్యం!

*దేశంలో సింహాలు తగ్గుతున్నాయి, పులులు తగ్గిపోయాయి. సెల్‌ఫోన్ సిగ్నల్స్ మూలంగా పిచ్చుకలు అంతరిస్తున్నాయి. అరణ్యాలు కనుమరుగవుతున్న నేపథ్యంలో జింకలు, కుందేళ్ల వంటి వన్యప్రాణులు కూడా తగ్గిపోతున్నాయి. చివరకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల ద్వారా జనాభాను కూడా తగ్గించే పరిస్థితి వచ్చింది. ఇన్ని రకాల జీవాలు తగ్గుతున్నా నెల్లూరు నగరంలో పందులు మాత్రం తగ్గడం లేదు. సరికదా, నెల్లూరులో జనాభా కంటే కూడా పందులే ఎక్కువగా కనిపిస్తున్నాయి.*

నెల్లూరు నగరం అత్యంత నికృష్టంగా తయారైందని చెప్పడంలో సందేహపడాల్సిందేమీ లేదు. ఇప్పుడు నగరంలో నెలకొన్న పరిస్థితులను చూస్తుంటే గత పాలకులే ఎంతో నయమనిపిస్తున్నారు. నెల్లూరును పందులకు రాసిచ్చేసినట్లుగా వుంది. నగరంలోని ఏ వీధిలో చూసినా మనుషులకంటే పందులే ఎక్కువ కనిపిస్తున్నాయి. ఒక పంది ఒక ఈతలో పదికిపైగా పిల్లల్ని కంటుంది. దాదాపు అన్ని పిల్లలు బ్రతుకుతాయి. కాబట్టి పందుల సంఖ్య నగరంలో బాగా పెరిగిపోతోంది. పందులు మేపేవాళ్లు కూడా జనావాసాల మధ్యే ఉంటున్నారు. అదేమంటే... మేం ఇక్కడే ఏళ్ల తరబడి ఉంటున్నాం, మీరే మా ప్రాంతాల్లోకి వచ్చి భవనాలు కట్టుకుని మమ్మల్ని దబాయిస్తారేంటని అడుగుతున్నారు. నిజమే... నగరం పెరుగుతుంది కాబట్టి ఒకప్పుడు పందులు మేపే ప్రాంతాలు కూడా ఇప్పుడు నివాసప్రాంతాలయ్యాయి. కాని మనుషులు, పందులు ఒకే చోట కలిసిమెలసి ఉండడం కష్టం కదా! పందులకు మేత కూడా నివాస ప్రాంతాల మధ్యే వేస్తున్నారు. దీంతో ఆ పరిసరాలు కంపు కొడుతుంటాయి. పందుల మూలంగా ఇక ప్రాణాంతక వ్యాధులు ప్రబలే అవకాశం వుందన్న సంగతి కూడా తెలిసిందే! నగరంలో మాగుంట లే అవుట్, బాలాజీనగర్, ఎన్‌టిఆర్ నగర్, వెంగళరావునగర్, మైపాడురోడ్డు, జాకీర్‌హుస్సేన్ నగర్, ఏ.సి.నగర్, సంతపేట, మన్సూర్‌నగర్, వేదాయపాళెం... ఒక ఏరియా అని ఏముంది... నగరంలో దాదాపు అన్ని ప్రాంతాలలోనూ పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. నెల్లూరురోడ్లను, వీధులను పందులు ఆక్రమించేస్తున్నా మన నగర పాలకులకు మాత్రం ముదురుదోమ కుట్టినట్లుగా కూడా ఉండడం లేదు.



## హింసపురి టైం మార్చండి మహాప్రభో...

### - వెంకయ్యకు మొరపెట్టుకున్న సోమిరెడ్డి



ప్రయాణీకుల నోట హింసపురి ఎక్స్‌ప్రెస్‌గా పిలిపించుకుంటున్న సింహపురి ఎక్స్‌ప్రెస్ టైమింగ్‌ను మార్చాలని చాలామంది ఎప్పటినుండో కోరుతున్నారు. కాని రైల్వే అధికారుల నుండి ఇంతవరకు స్పందన లేదు. తాజాగా శాసనమండలి సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కూడా కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడుకు సింహపురి వేళలు మార్చాలంటూ లేఖ వ్రాశారు. సింహపురి ఎక్స్‌ప్రెస్ రోజూ గూడూరులో రాత్రి 10గంటలకు బయలుదేరి, నెల్లూరుకు 10.45కు చేరుకుంటుంది. ఇక్కడ నుండి విజయవాడ మీదుగా హైదరాబాద్‌కు వెళ్ళేసరికి ఉదయం 10గంటలైపోతుంది. ఏదన్నా పనుల మీద వెళ్లేసరికి ఒక పూట ఇట్టే గడిచిపోతుంది. కాబట్టి ఈ రైలు బండిని ఇంకా ముందుగా కదిలేలా చేయాలని సోమిరెడ్డి ఆ లేఖలో కోరారు. అంతే కాదు, విజయవాడ మీదుగా అదే టైంలో పద్మావతి, ఛార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లున్నాయని, కాబట్టి సింహపురిని రాజధాని ప్రాంతానికి అనువుగా గుంటూరు మీదుగా నడిపితే ఒక గంట ప్రయాణకాలం కూడా తగ్గుతుందని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. సోమిరెడ్డి లేఖకు స్పందించిన వెంకయ్యనాయుడు ఈ సింహపురి ట్రైన్ సంగతి ఏంటో చూడండంటూ కేంద్ర రైల్వేశాఖ మంత్రి సురేష్ ప్రభుకు ఓ లేఖ వ్రాశారు.

## ఎల్లో ఎలర్జీ వదిలిందా?



మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డికి కాంగ్రెస్‌పార్టీలో ఉన్నంత కాలం పసుపురంగు అంటే పడేది కాదు. ఆ రంగును చూస్తే ఆయనకు అలర్జీగా ఉండేది. తెలుగుదేశం పార్టీ జెండా రంగు పసుపు కావడమే ఇందుకు కారణం. పలు సందర్భాలలో ఆయన నోట పసుపు రంగు అంటేనే పడదు అనే మాటలు వచ్చాయి కూడా. ఇప్పుడు తెలుగుదేశంలో చేరాక కారుకు, పార్టీ ఆఫీసుకు పసుపు జెండాలు, పసుపు ఫ్లెక్సీలు కడుతున్నాడు. మరి పసుపు అలర్జీ వ్యాధి పోయినట్లేనా?

## రత్నం విద్యార్థుల ప్రతిభ

నెల్లూరు రిత్విక్ ఎన్‌క్లేవ్‌లోని డాక్టర్ కిషోర్స్ రత్నం విద్యార్థులు నేషనల్ మాక్స్ ఒలంపియాడ్‌కు ఎంపికై తమ ప్రతిభను చాటారు. రెండవ లెవల్‌కు నాగశరణ్య, మిథిలేష్‌రెడ్డి, ప్రణీత్‌రెడ్డి ఎంపికయ్యారు. ఆధునిక పద్ధతుల్లో బోధన, శిక్షణ కార్యక్రమాలు, మెటీరియల్స్ విద్యార్థులకు ఉపయోగపడ్డాయని స్కూల్స్ ప్రిన్సిపాల్స్ ఉమారాణి, సునీత తెలిపారు. ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలంపియాడ్ ఫలితాల్లో ఓవెల్ విద్యార్థులు సెకండ్ లెవల్‌కు అర్హత సాధించారని స్కూల్ ప్రిన్సిపల్ వేణు తెలిపారు. హసనికా, సాధు, జయచందు, శశాంక్ దత్తు, సుమశ్రీ ఎంపికైనట్లు తెలిపారు.

## లయన్స్ స్వచ్ఛభారత్



లయన్స్ క్లబ్ ఆఫ్ పినాకిని మరియు లియోస్ క్లబ్ నెల్లూరు ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరు గాంధీబొమ్మ వద్ద స్వచ్ఛభారత్ మరియు ట్రాఫిక్‌పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. నగర డిఎస్పీ జి.వి.రాముడు, 1వ నగర సిఐ నరసింహరావులు పాల్గొన్నారు. లయన్స్ సభ్యులు స్వతంత్రపార్కులో చెత్త, చెదారం తీసేసి పరిశుభ్రంగా ఉంచారు. అలాగే గాంధీబొమ్మ వద్ద ద్విచక్రవాహనదారులకు ట్రాఫిక్ అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. వీటికి సంబంధించి కరపత్రాలను కూడా పంపిణీ చేశారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని, దీనివల్ల ఎలాంటి ప్రమాదాలకు గురైనా ప్రాణాలకు ప్రమాదం ఉండదని ఈ సందర్భంగా డిఎస్పీ పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు, ట్రాఫిక్ క్రమపద్ధతిలో నడిచేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లియోస్ క్లబ్ ఇన్‌ఛార్జి గాదంశెట్టి శ్రీకాంత్, ఛైర్మెన్ యిమ్మడిశెట్టి రామకృష్ణ, అధ్యక్షులు ఇ.లోకేష్, కార్యదర్శి స్వీటి, పినాకిని క్లబ్ అధ్యక్షులు కోట రమేష్‌బాబు, గుర్రం కోటేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సంప్రదాయాలకు పండుగలు చిహ్నాలు

భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలకు పండుగలు చిహ్నాలని సింహపురి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఎండి రవీంద్రరెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు చిల్డ్రన్స్ పార్కు రోడ్డులో ఆదివారం సాయంత్రం డివైఎఫ్ఐ, ఐద్వా, 16వ డివిజన్ అభివృద్ధి కమిటి సంయుక్త ఆధ్వర్యంలో సంక్రాంతి రంగవల్లుల పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ఇలాంటి పోటీలను నిర్వహించడం ద్వారా గ్రామాల వాతావరణాన్ని పట్టణాల్లోకి తీసుకురావచ్చన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల ఏజెన్సీ అధినేత మధుసూదనరెడ్డి, డాక్టర్ పద్మజ, పద్మశ్రీ, డివైఎఫ్ఐ నాయకులు శ్రీనివాసులు, సూర్యనారాయణ, సుబ్బు, జయరామిరెడ్డి, విద్యాచరణ్, సెల్వీ తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు

## నెల్లూరుకు సంక్రాంతి కళ

ప్రతి ఏడాదిలో మొదట వచ్చే పండుగ సంక్రాంతి. తెలుగు వారికి అత్యంత ఇష్టమైన సంబరం. నెల్లూరులో గత వారం రోజులుగా సంక్రాంతి సందడి కనిపిస్తుంది. విద్యాసంస్థలకు సెలవులివ్వడంతో పిల్లలు ఇళ్ల వద్ద వుంటున్నారు. కొందరు తమ పెద్దల వూర్లకు వెళ్లారు. ఇక సంక్రాంతికి వూర్లకు వెళ్లే వారితో బస్సులు, రైళ్లు కిటకిటలాడాయి. ఆర్టీసీవాళ్లు స్పెషల్ బస్సులను, రైల్వేశాఖ స్పెషల్ రైళ్లను కూడా నడుపుతున్నాయి. ఇక సంక్రాంతి అంటే బట్టల దుకాణాలకు పెద్దపండుగే! వస్త్ర దుకాణాలు స్పెషల్ ఆఫర్లతో కస్టమర్లను ఆకట్టుకుంటున్నాయి. వీక్లీ డ్రాలు, లక్కీడ్రాలతో ఖాతాదారులను ఆకర్షిస్తున్నాయి. ప్రతి బట్టల షోరూం వద్ద తిరునాళ్ళ వాతావరణం నెలకొంది. కాపువీధి, సండేమార్కెట్‌ల వద్దయితే రోజూ రంగడి తిరునాల మాదిరిగానే వుండింది. ఇక పిండి వంటల ఘుమఘుమలు ప్రతి ఇంటి నుండి వస్తున్నాయి.

## జగన్నాథ రథయాత్రకు సన్నాహాలు

### - ఇస్కాన్ అధ్యక్షుడు సుకదేవస్వామి



నెల్లూరు నగరంలో ఈ నెల 30న 5వ జగన్నాథ రథయాత్ర నిర్వహించేందుకు ఇస్కాన్ మందిరం వారు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ మేరకు నిర్వాహకులు స్థానిక మినీ బైపాస్‌రోడ్డులో వున్న ఇస్కాన్ మందిరంలో ఈ నెల 9న జగన్నాథ రథయాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నెల్లూరు ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు సుకదేవస్వామి మాట్లాడుతూ, నగరంలోని పప్పులవీధిలో వున్న సత్రంబడి వద్ద నుంచి 30వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు రథయాత్ర ప్రారంభమై, రాత్రి 8 గంటలకు కస్తూరిదేవి గార్డెన్స్ వద్దకు చేరుకుంటుందని, అనంతరం 9 గంటలకు దేశంలోని వివిధప్రాంతాలకు చెందిన ఇస్కాన్ స్వామీజీలు, ముఖ్యఅతిథులు సందేశాలు ఇస్తారని పేర్కొన్నారు. ప్రజల కోరికపై ఈ ఏడాది ఏప్రిల్‌లో సూళ్ళూరుపేటలోనూ జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తామన్నారు. పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో సుకదేవస్వామితో పాటు కార్యనిర్వాహక కమిటీ సభ్యులు డివిఎస్ గిరి, కృష్ణారెడ్డి, రాజశేఖరదాస్ తదితరులు పాల్గొన్నారు.

## మైథిలిలో నవ్వుల పండుగ




ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని మైథిలి స్కూల్‌లో ఈ నెల 8న నవ్వుల దినోత్సవం నిర్వహించారు. మురళీ ఆర్ట్స్ నిర్వాహకుడు శింగంశెట్టి మురళీమోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నవ్వు ఆరోగ్యానికెంతో ఉపయోగకరమన్నారు. నవ్వు.. నవ్వించు.. ఆ నవ్వులతో ఆనందం పండించు.. అనే రీతిలో అందరూ హాయిగా నవ్వుకుంటూ మాట్లాడుకుంటే ఆరోగ్యానికి ఎంతో మంచిదన్నారు. ఈ కార్య క్రమంలో స్కూల్ నిర్వాహకులు మైథిలి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ, నవ్వుతో మంచి ఆరోగ్యం వస్తుందని, నవ్వడం కూడా శరీరానికి ఒక వ్యాయామమేనని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నవ్వుల పోటీలను ఒక పండుగలా ఎంతో ఆనందంగా నిర్వహించి, విజేతలకు బహుమతులందించారు.







• ముగిసిన హడావిడి

# అతిథులున్నారు.. 'అతి'రథులు వెళ్లిపోయారు!

- విహంగాల విహారాలు తిలకించి పులకిస్తున్న జనం
- కన్నులపండుగ చేస్తున్న పక్షుల సోయగాలు



***మొత్తమ్మీద ఒక పెద్ద హడావిడి ముగిసింది. జిల్లాలో ఈ నెల 9,10 తేదీల్లో జరిగిన పక్షుల పండుగ (ఫ్లెమింగో ఫెస్టివల్) సందర్శకులకు ఎంతో ఆనందాన్నిచ్చింది. విహంగాల విన్యాసాలు అందరినీ బాగా ఆకట్టుకున్నాయి.***

అయితే, పక్షుల రాకను పురస్కరించుకుని సూళ్ళూరుపేటలో ఓ రెండు రోజులు పండుగ జరిగినా, ఆ తర్వాత రోజుల్లో కూడా పక్షులు ఇక్కడికి వచ్చే పర్యాటకులను ఆకట్టుకుంటూనే వుంటాయి. పక్షుల పండుగ కోసం విచ్చేసిన నాయకులు, అతిరథులంతా వచ్చి వెళ్ళిపోయినా.. ఈ ప్రాంతానికి అతిథులుగా వచ్చిన ఆ విదేశీ వలస పక్షులన్నీ ఇక్కడే వున్నాయి. ఈ సందర్భంగా అధికార పార్టీ నాయకుల వర్గ విభేధాలూ, ఆధిపత్య ప్రదర్శనలకు కూడా ఈ పండుగే వేదిక కావడం విమర్శలకు దారితీసింది. అందులోనూ అందరూ ఆనందంగా పాల్గొనాల్సిన ఈ పక్షుల పండుగలో కూడా నాయకులు ఎవరికి వారే పులికాట్ తీరే.. అన్నట్లుగా వుండడంతో, పండుగలో ఆశించిన ఆనందం వెల్లివిరియలేదనే విమర్శలు వచ్చాయి. కానీ, ఆ పక్షులు మాత్రం ఇలాంటివేమీ పట్టించుకోకుండా సందర్శకులను అలరిస్తూనే వున్నాయి. మార్చి నెలాఖరుదాకా కూడా అవి ఈ ప్రాంతాల్లోనే వుంటాయి. వాటికి విడిది ఇక్కడే... ఆహార విహారాదులన్నీ ఇక్కడే. అందులోనూ ఇప్పుడు సంక్రాంతి పండుగ రోజులు కనుక.. పాఠశాలలకు సెలవులు రావడంతో కన్నుల పండుగ జేసే ఆ పక్షుల సోయగాలను తిలకించడానికి చిన్నారులు, సందర్శకులు నేలపట్టు తదితర ప్రాంతాలకు పెద్దసంఖ్యలో వస్తూనే వున్నారు.





రంగు రంగుల రెక్కలతో, అందాల ముక్కులతో కిలకిలారావాలు చేస్తూ..ఆ పక్షులు అలా ఆనందంగా ఎగురుతూ వుంటే చిన్నారులు సంతోషంతో కేరింతలు కొడుతున్నారు. పక్షుల అందచందాలు, వాటి విహారాలు పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. దీంతో పక్షుల విహార ప్రాంతాలైన పులికాట్ సరస్సు, నేలపట్టు, తడ తదితర ప్రాంతాలన్నీ పర్యాటకులతో నిత్యం రద్దీగానే వుంటున్నాయి. కాగా, పక్షుల పండుగను పురస్కరించుకుని ప్రత్యేకించి సూళ్ళూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో పక్షుల పండుగ సంబరాలను రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ ప్రారంభించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి శిద్ధా రాఘవరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణంలో వివిధ శాఖలకు సంబంధించిన ఏర్పాటు చేసిన స్టాల్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కార్యక్ర మాలు అందరినీ అలరించాయి. జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకి నేతృత్వంలో అధికారయంత్రాంగం ఈ పండుగ నిర్వహణ కోసం భారీ ఏర్పాట్లు చేసింది. పెద్దఎత్తున చిన్నారులు, విద్యార్థులు, యువత, సందర్శకులు విచ్చేసి ఈ పక్షుల పండుగలో పాల్గొని అందాల పక్షుల సోయగాలను, వాటి విహారాలను కన్నులారా తిలకించి పులకించిపోయారు. అధికారయంత్రాంగం ఇక్కడే వుండి పర్యవేక్షణ చేస్తూ పక్షుల పండుగను విజయవంతం చేస్తున్నారు.

## పర్యాటక ప్రగతికి మరింత ప్రాధాన్యం

*- మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి*



రాష్ట్ర అటవీశాఖ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఆదివారం రాత్రి సూళ్ళూరుపేటలో జరిగిన పక్షుల పండుగ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో తీరప్రాంతాలతో పాటు సూళ్ళూరుపేట నియోజకవర్గం పరిధిలోని పులికాట్ సరస్సు తీరాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. అదేవిధంగా, సూళ్ళూరుపేట, తడ, నేలపట్టు ప్రాంతాలను మరింతగా అభివృద్ధి చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. భీములవారిపాళెం పడవల రేవులో రిసార్ట్‌ల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. నేలపట్టు చెరువును హైదరాబాద్ ట్యాంక్‌బండ్ తరహాలో అభివృద్ధి చేయడానికి, చిన్నారుల కోసం ఇక్కడ పార్కును నిర్మించడానికి కృషి చేస్తామన్నారు. ఈ సభకు అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ, సూళ్ళూరుపేటలో జరిగే ఈ విశిష్టమైన పండుగను రాష్ట్రస్థాయిలో విస్తరించాలన్నారు. ఎంపీ వెలగపల్లి వరప్రసాదరావు మాట్లాడుతూ, షార్ నిధులతో సూళ్లూరుపేట అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. తిరుమల తిరుపతి దేవస్థానాల ఛైర్మెన్ చదలవాడ కృష్ణమూర్తి మాట్లాడుతూ, సూళ్లూరుపేట సమీపంలోని మన్నారుపోలూరు ఆలయాన్ని టిటిడి దత్తత తీసుకుని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తుందన్నారు. శ్రీహరికోటలోని షార్ ద్వారా 50 రాకెట్ ప్రయోగాలను పూర్తిచేసినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ ఈ సందర్భంగా షార్ డైరెక్టర్ కున్హికృష్ణన్‌ను ఘనంగా సత్కరించారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ఎమ్మెల్సీలు వాకాటి నారాయణరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకి, సూళ్ళూరుపేట ఎంపిపి షేక్‌షమీమ్, మునిసిపల్ ఛైర్మెన్ విజయలక్ష్మి, షార్ కంట్రోలర్ జెవి రాజారెడ్డి, నాయకులు వేనాటి రామచంద్రారెడ్డి, శోభారాణి, ఆలేఖ్య, ఇసనాక హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రెస్‌క్లబ్‌లో నారాయణ



రాజీయాడ్స్ అధినేత మోపూరు పెంచలయ్యను సత్కరిస్తున్న మంత్రి పి.నారాయణ

రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ ఈనెల 8వతేదీన నెల్లూరు, మహబూబ్ ఖాన్ పార్కులో గల ఏపి యుడబ్ల్యూజె ప్రెస్‌క్లబ్‌ను తొలిసారిగా సందర్శించారు. నవంబర్‌లో వచ్చిన వరదలకు సంబంధించిన ఫోటో గ్యాలరీని ఆయన ఇక్కడ ఆవిష్కరించారు. జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి వుందని ఆయన చెప్పారు. జర్నలిస్టుల కోసం హెల్త్ ఇన్సూరెన్స్‌ను ప్రవేశపెట్టామని, 2.50లక్షల వరకు ఉచిత వైద్యం పొందవచ్చున్నారు. ఇప్పటివరకు జర్నలిస్టులకు 800అక్రిడేషన్‌లు ఉండగా ఈ యేడాది వాటిని 1400కు పెంచామన్నారు. ఈ సందర్భంగా మంత్రి గతంలో ప్రెస్‌క్లబ్ ఇన్‌ఛార్జ్‌గా పనిచేసిన రాజీయాడ్స్ అధినేత మోపూరు పెంచలయ్యను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ నాయకులు ఏ.జయప్రకాశ్, చంద్రశేఖర్, జయరాజ్, రాజన్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## రెయిన్‌బోలో సంక్రాంతి సంబరం



నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని రెయిన్‌బో స్కూల్‌లో సంక్రాంతి వేడుకలను సాంప్రదాయ రీతుల్లో నిర్వహించారు. భోగి మంటలు వేసి రంగవల్లులు తీర్చిదిద్ది ఈ పండుగ విశేషాలను టీచర్లు పిల్లలకు వివరించారు. ప్రద్యుమ్న హరిదాసు వేషధారణతో అలరించగా, గంగిరెద్దులు, కోడిపుంజులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో స్కూలు డైరెక్టర్ పద్మాసుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ అరుణ స్వయంప్రభ, ఫాతిమాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ సంక్రాంతి సెలవు



జిల్లా కలెక్టర్ యం.జానకి సంక్రాంతి సెలవు పెట్టారు. ఈ నెల 11 నుండి 16వ తేదీ వరకు ఆమె సెలవుపెట్టి వెళ్లారు. జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ ఇన్‌ఛార్జ్ కలెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. అలాగే నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.యస్. మూర్తి కూడా సంక్రాంతి సెలవుల మీద వెళ్లిపోయారు. డిప్యూటీ కమిషనర్ ఇన్‌ఛార్జ్ కమిషనర్‌గా వ్యవహరిస్తున్నారు. జిల్లాలో ఇంకా పలువురు ఉన్నతాధికారులు సంక్రాంతి సెలవులపై వెళ్లిపోవడంతో ప్రభుత్వ కార్యాలయాల్లో సందడి తగ్గిపోయింది.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# స్నేహాన్ని పెంచేవే ఆటలు



బహుమతులందుకుంటున్న విజేత తెలుగుదేశంపార్టీ జట్టు, రన్నర్స్ మీడియా జట్టు

గూడూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కోట అసోసియేట్ అధినేత కోట సునీల్ కుమార్ దాతృత్వంతో మూడురోజుల పాటు మీడియా, లయన్స్ క్లబ్, పోలీసు, రోటరీ క్లబ్, వైసిపి, టిడిపి, కాంగ్రెస్, వాకర్స్, కోట అసోసియేట్స్ జట్ల మధ్య నిర్వహించిన క్రికెట్ పోటీలు సోమవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ వివిధ రంగాల్లో రాణిస్తున్న వారిని ఓ చోటకు చేర్చి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం స్నేహభావాన్ని పెంపుందించేందుకేనని అన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి చేవూరు విజయమోహన్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడాస్ఫూర్తితో స్నేహపూరిత వాతావరణంలో మ్యాచ్‌లు విజయవంతంగా నిర్వహించడం అభినందనీయ మన్నారు. అనంతరం పోటీలలో విజేత టిడిపి, రన్నర్ మీడియా జట్లకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షుడు తోట సురేష్‌నాయుడు, నీలకంఠం నవీన్ జయకుమార్, నిర్వాహకుడు కడివేటి చంద్రశేఖర్, ఆర్.వి.రావు, ఎం.వి.రమణయ్య, పిఇటి సుబ్రహ్మణ్యం, బద్రిగిరి, కొండూరు రామరాజు, వల్లూరు మోహన్, వాటంబేడు శివకుమార్, దండు మంగేష్‌రెడ్డి, శ్రీధర్, విజయకుమార్, మారుబోయిన చిరంజీవి, కోట సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దల పండుగ

# ఏర్పాట్లను పరిశీలించిన కోటంరెడ్డి



నెల్లూరు వెంగళరావునగర్‌లోని హిందు శ్మశాన వాటికలో పెద్దల పండుగ ఏర్పాట్లని ఈ నెల 11న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీదర్‌రెడ్డి పర్యవేక్షించారు. స్మశానవాటికను పరిశుభ్రంగా ఉంచాలని, కరెంటు సౌకర్యం కల్పించాలని, పెద్దల పండుగలో ప్రజలకి ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో హజరత్ నాయుడు, డా॥ సత్తార్, సర్వతాల శ్రీనివాసులు, చిన్న మస్తాన్, వాసు, దాసు, ఎర్రయ్య, అబ్దుల్ ఘని, జుబేదమ్మ, సుబ్బరాయుడు, షంషేర్, రమేష్, రమణారెడ్డి, నాని, చిన్న హజరత్ పాల్గొన్నారు.

# శాస్త్రీజీని మరచిన ముఠామేస్త్రీలు

**- వాస్తు రామచంద్ర**

భారతీయులకు నీతి, నిజాయితీ, నిరాడంబరం, అవినీతి రహిత పాలన ఇచ్చి ప్రధానిగా కొద్దికాలమే పని చేసినా అందరి మెప్పు పొంది, పాకిస్తాన్‌ను యుద్ధంలో ఓడించిన ధీరుడు లాల్‌బహుదూర్ శాస్త్రి అని సమాచార హక్కు, సామాజిక పర్యవేక్షణ సమితి గౌరవాధ్యక్షులు వాస్తు రామచంద్ర ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నెల్లూరుజిల్లా కేంద్రంలో 54 విగ్రహాలుంటే పుచ్చలపల్లి సుందరయ్య, బి.ఆర్.అంబేద్కర్, సర్ధార్‌జీ విగ్రహాలు ఆదర్శంగా ఉన్నాయన్నారు. నిస్వార్ధపరుడు శాస్త్రీజీ విగ్రహాన్ని నెల్లూరు నగరంలోని రామలింగాపురం, హరనాథపురం, రాంజీనగర్ కూడలిలో ప్రతిష్టించాలని డిమాండ్ చేశారు. యువత శాస్త్రీజీని ఆదర్శంగా తీసుకుని నేటి దుర్మార్గ రాజకీయాలకు స్వస్తి పలకాలన్నారు. తన అధ్యక్షతన సోమవారం సమావేశం జరిగిందని, ఇందులో శాస్త్రీజీ విగ్రహాన్ని నిర్మించాలన్న తీర్మానం జరిగిందన్నారు. ఈ సమావేశంలో రామచెంచయ్య, చల్లా యానాదయ్య, గౌరినేని వెంకయ్య, ఇంజనీరు చంద్రశేఖర్, వై.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# డిపిఓగా సెల్వీ



జిల్లా పంచాయితీ రాజ్ అధికారిగా డిఎం సెల్వీని నియమించారు. సోమవారం ఆమె బాధ్యతలు కూడా తీసుకున్నారు. విశాఖ జిల్లా పాడేరులో డిఎల్‌పిఓగా పనిచేస్తున్న ఆమెను నెల్లూరుకు బదిలీ చేశారు. 2011 నుండి నెల్లూరు డిపిఓ పోస్ట్ ఖాళీగానే వుంది. అప్పటి నుండి జడ్పీ సిఇఓలే ఇన్‌ఛార్జ్ డిపిఓలుగా వ్యవహరిస్తున్నారు. ఇన్నేళ్ల తర్వాత పూర్తిస్థాయి డిపిఓను నియమించారు.

# వృద్ధులకు రోటరీ చేయూత స్ఫూర్తిదాయకం

గూడూరు పట్టణంలోని రోటరీ భవన్‌లో రోటరీ హెల్పేజ్ ఆధ్వర్యాన ఆదివారం వృద్ధులకు ఫలసరుకులు పంపిణీ చేశారు. రోటరీ హెల్పేజ్ ప్రారంభించి 11ఏళ్లయిన సందర్భంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తిరుపతి ఎంపి వి.వరప్రసాద్‌రావు ముఖ్యఅతిథిగా ఈ కార్యక్రమానికి వచ్చి మాట్లాడుతూ ప్రభుత్వమే అన్ని పథకాలు అమలు చేయడం కష్టమని, రోటరీ లాంటి సంస్థలు ప్రభుత్వం చేయలేని ఎన్నో కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. సంస్థను ప్రారంభించి మూలధనాన్ని ఏర్పాటు చేసిన దివంగత అల్లూరు ఆదిశేషారెడ్డిని ఆయన స్మరించుకున్నారు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ అల్లూరు ఆదిశేషారెడ్డి గూడూరులో ఎన్నో కార్యక్రమాలను చేపట్టారని, అందులో రోటరీ హెల్పేజ్ కార్యక్రమం ప్రత్యేకమైందని, ఆయన తర్వాత రోటరీ వారు ఎంతో చక్కగా నిర్వహిస్తున్నారన్నారు. 'లాయర్' వారపత్రిక ఎడిటర్ తుంగా శివప్రభాత్‌రెడ్డి



వృద్ధులకు ఫలసరుకులు పంపిణీ చేస్తున్న ముఖ్యఅతిథులు

## గూడూరు డివిజన్ వార్తలు

మాట్లాడుతూ పిల్లల నిరాదరణకు గురై ఆపదలో ఉన్న వృద్ధుల జీవనానికి ఫలసరుకులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. వృద్ధులైన తల్లిదండ్రులను ఆదుకోవడం నాకు చాలా ఇష్టమని, అందుకనే ఈ కార్యక్రమంలో పాల్గొన్నానని, ఈ హెల్పేజ్‌కు ఈ నెల 18వ తేదీ తమ తండ్రి తుంగా రాజగోపాలరెడ్డి 21వ వర్ధంతి సందర్భంగా 20వేల రూపాయలు అందజేస్తానన్నారు.

కీ॥శే॥ దాసు సరోజనమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమార్తె పుత్తూరుకు చెందిన డా॥ వేలూరు హైమావతి రూ.20వేలు, ఎంపి వరప్రసాద్, ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ రూ. పది వేలు చొప్పున హెల్పేజ్ కార్యక్రమానికి అందజేస్తున్నట్లు ప్రకటించారు. వయోవృద్ధులకు సేవ చేయడం అభినందనీయమని, నిరంతరాయంగా సేవ చేస్తే అందులో ఉండే సంతృప్తి ఎందులోనూ ఉండదని పలువురు వక్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఎస్వీ ఆశోక్‌చక్రవర్తి, రోటరీ మాజీ అసిస్టెంట్ గవర్నర్ కె.మునిగిరీష్, కార్యదర్శి మునిరాజా, రోటరీ ప్రతినిధులు జానకిరామిరెడ్డి, దశరథరామిరెడ్డి, దయాకరరెడ్డి, కె.ఎస్.రెడ్డి, కె.సుందరరామిరెడ్డి, రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సిపిఇకి ఎంపికైన ఎన్‌బికెఆర్



నెల్లూరుజిల్లాలో మొట్టమొదటి ఇంజనీరింగ్ కాలేజీ కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల. విశ్వవిద్యాలయాల నిధుల కమిషన్(యుజిసి) నిధుల మంజూరులో భాగంగా సెంటర్ విత్ పొటన్షియల్ ఫర్ ఎక్సెలెన్స్(సిపిఇ) కొరకు ఈ కళాశాల ఎంపికైంది. మన రాష్ట్రంలో వున్న 341ఇంజనీరింగ్ కళాశాలల్లో ఏడు మాత్రమే ఎంపిక కాగా, నెల్లూరుజిల్లా నుండి ఎన్‌బికెఆర్ ఒక్కటే ఎంపిక కావడం గమనార్హం. కళాశాలలో వున్న మౌలిక సదుపాయాల ఆధారంగా ఈ ఎంపిక చేస్తారని, కళాశాల అభివృద్ధి కొరకు ఈ నెలాఖరులో ఢిల్లీలో జరుగనున్న సమావేశానికి కళాశాల ప్రతినిధులను పంపమని యూజిసి ఆహ్వానం పంపిందని కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ఈ గుర్తింపు రావడానికి కృషి చేసిన అధ్యాపక బృందాన్ని, సిబ్బందిని అభినందించారు. కళాశాల ఛైర్మెన్ డాక్టర్ గోపాలరెడ్డి మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులలో ఉద్యోగ నైపుణ్యాలను పెంచడానికి ఈ సిపిఇ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ సమావేశంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి కూడా పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, ప్రక్కన కమిషనర్ మోదకొండ తదితరులు

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన తెలిపారు. పట్టణంలోని 13వ వార్డు 'జన్మభూమి – మా ఊరు' కార్యక్రమాన్ని స్థానిక సిఎస్ఎం పాఠశాల ఆవరణలో ఆదివారం కమిషనర్ మోదకొండ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఇళ్లు మంజూరు చేస్తున్నామని, అర్హులైన ప్రతి కుటుంబం దరఖాస్తు చేసుకొని లబ్ది పొందాలని కోరారు. ప్రజల వద్దకే అధికారులు వస్తుండటంతో అన్ని సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని కోరారు. పేద ప్రజల అభివృద్ధికి మౌలిక వసతుల కల్పన, స్మార్టువార్డు, స్వచ్ఛభారత్ కార్యక్రమాలను సంయుక్తంగా కలసి విజయవంతం చేయాలని సూచించారు. రేషన్‌కార్డులు, పింఛన్లు, వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరుకు అర్జీదారులు వినతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఛైర్మెన్ శీలం కిరణ్‌కుమార్, డాక్టర్ చంద్రహాస్, ఏడుకొండలు, అర్బన్ సిడిపివో ఉమామహేశ్వరి, కౌన్సిలర్ షంషీర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కోడి పందేలు నిర్వహిస్తే..

# కఠిన చర్యలు

**- డిఎస్పీ శ్రీనివాస్**



గూడూరు డివిజన్‌లో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గ్రామాల్లో కోడి పందేలు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ హెచ్చరించారు. 9వ తేదీ స్థానిక డిఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో కోడిపందేలు సంప్రదాయంగా నిర్వహిస్తారని, అయితే అది శృతిమించి బెట్టింగులకు పాల్పడటంతో పలు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. ఇప్పటికే గ్రామాల్లో పలు దఫాలు అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. పండుగల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. ఇందులో భాగంగా సమస్యాత్మక గ్రామాల్లో బందోబస్తును పటిష్ట పరిచామన్నారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరించి ప్రశాంత వాతావరణంలో సందడితో పండుగలు జరుపుకోవాలన్నారు.

## మేషం

అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఇంటా బయట వ్యవహారాలను సమర్ధవంతంగా నిర్వహిస్తారు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగి ఆదాయం పెరుగుతుంది. దైవ కార్యాలు, సేవా కార్యాలలో పాల్గొంటారు. కుటుంబ సభ్యులకు స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. షేర్లు నిరుత్సాహ పరుస్తాయి. పనులు నిదానంగా సాగుతాయి. అనవసర విషయాలలో చొరవ తీసుకోనవద్దు. అధికారులకు స్థాన చలనము.

## కన్య

ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

తొందరపాటు వ్యవహారాలు తగ్గించుకొని అనుకున్న పనులను సమయానుకూలంగా జరుపుకొనండి. అయితే టెన్షన్ ఎక్కువగా వుంటుంది. అధికారులకు మార్పు, ఉద్యోగులకు పనిభారం ఎక్కువ. వృత్తి వ్యాపారాలలో అవకాశాలు బాగుండి ఆదాయం బాగుండును. కొత్త పెట్టుబడులు, వ్యాపార విస్తరణ బాగుండి ప్రభుత్వ అనుమతులు, ఋణాలు లభించగలవు.

## వృశ్చికం

విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆర్థికంగా బాగుండినా అవసరాలకు ఋణం చేయవలసి రావచ్చును. ఏ వ్యవహారంలోనైనా ఆత్మీయులను సంప్రదించి నిర్ణయాలు తీసికొనండి. ఇతరులకు సహాయ పడతారు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. స్థిరాస్తుల లావాదేవీలను వాయిదా వేసికొనండి. ఉద్యోగులు అధికారుల ప్రలోభాలకు దూరంగా ఉండండి. కొత్త వస్తువులు కొంటారు. షేర్లు పెట్టుబడులు లాభసాటిగా ఉంటాయి.

## వృషభం

కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్ష1, 2పాదాలు

వృత్తి వ్యాపారాలు బాగా ఉండి, ఆదాయము పెరిగినా అసంతృప్తి ఉంటుంది. కుటుంబ అవసరాలు, ప్రయాణ ఖర్చులు బాగుంటాయి. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. అవసరాలకు మూల ధనము తీయడం, లేక చేబదుళ్ల తీసికొనడం జరుగవచ్చును. విద్యా ప్రగతి బాగుంటుంది. అప్పుడప్పుడు టెన్షన్ పడుతుంటారు. కోర్టు కేసులు వాయిదా పడతాయి.



## బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 15.01.2016 నుండి
తేది. 21.01.2016 వరకు

ఈ వారం మీన మేష వృషభ మిధున రాశులలో చంద్రుడు, మీనంలో కేతువు, సింహంలో గురువు, కన్యలో రాహువు, తులలో కుజుడు, వృశ్చికంలో శని శుక్రులు, 18తేది నుండి ధనుస్సులో శుక్రుడు, ధనుస్సులో బుధుడు, మకరంలో రవి సంచరిస్తారు.

పంచాంగము:

ముహూర్తములు లేవు

### పుష్య మాస శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 15 | శుక్ర | షష్ఠి | రా॥ గం.10.11వ॥ |
| తేది. 16 | శని | సప్తమి | రా॥ గం.7.50వ॥ |
| తేది. 17 | ఆది | అష్టమి | సా॥ గం.5.27వ॥ |
| తేది. 18 | సోమ | నవమి | సా॥ గం.3.12వ॥ |
| తేది. 19 | మంగళ | దశమి | ప॥ గం.1.04వ॥ |
| తేది. 20 | బుధ | ఏకాదశి | ఉ॥ గం.11.10వ॥ |
| తేది. 21 | గురు | ద్వాదశి | ఉ॥ గం.9.33వ॥ |

## ధనుస్సు

మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

చెల్లింపులు సకాలంలో జరుపుతారు. ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా ఉంటాయి. వృత్తి వ్యాపారాల పెరుగుదల, రాబడి అభివృద్ధి చెందుతుంది. కొత్త పెట్టుబడులకు అవకాశాలుంటాయి. అదనపు ఖర్చులు ఏదో ఒక రూపంలో పెట్టక తప్పదు. దూర ప్రాంతాల నుండి ఆహ్వానాలు, ప్రయాణాలుంటాయి. వస్తు వాహన గృహ రిపేర్లుంటాయి. విద్యా ప్రగతి బాగుంటుంది.

## మిధునం

మృగశిర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

కొత్త గృహోపకరణాలు, విలువైన వస్తువులు సమకూర్చుకొంటారు. ప్రభుత్వ అనుమతులందు ఆలస్యం, రావలసిన బాకీలు వాయిదా పడటం జరుగుతుంది. అల్లులతో తగాదాలుంటాయి. యజమానులకు వర్కర్లతో సమస్యలుంటాయి. బిడ్డల విద్య, ఉద్యోగావకాశాలు మెరుగుగా ఉంటాయి. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. ప్రముఖులను బంధుజాలాన్ని కలుసుకొంటారు.

## మకరం

ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఉద్యోగులకు పనిభారంతో పాటు గుర్తింపు గౌరవాలు బాగుంటాయి. వృత్తి వ్యాపారాలలో ఆశించినంత వృద్ధి ఉండదు. ఆదాయం సామాన్యం. గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి. అనుకున్న పనులు వాయిదా పడవచ్చును. కొత్త వ్యాపారాలకు, కాంట్రాక్టులకు ప్రయత్నాలు జరుగుతాయి. ఉద్యోగ ప్రయత్నాలు ఆశాజనకంగా ఉంటాయి. స్త్రీలు ఆరోగ్య విషయంలో జాగ్రత్త వహించాలి.

## కర్కాటకం

పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

కొత్త వ్యాపారవృద్ధి అవకాశాలు, అగ్రిమెంట్లు కలిసివస్తాయి. ఆదాయం పెరుగుతుంది. సేవా దైవ కార్యాలలో ప్రముఖంగా వ్యవహరిస్తారు. కొత్త వస్తువులు, విలువైన వస్తువులు చేకూర్చుకొంటారు. అనుకున్న ప్రయత్నాలకు అనుకూలత బాగుంటుంది. శుభకార్య ప్రయత్నాలు ఫలించగలవు. విద్యా ప్రగతి, కుటుంబ సౌఖ్యం బాగుంటుంది.

## కుంభం

ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

కుటుంబంలో స్వల్ప విభేదాలు చోటు చేసికొనవచ్చును. స్థిరాస్తుల లావాదేవీలు, నూతన గృహోపకరణాలు కొనడం జరుగుతుంది. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. అనుకున్న పనులు టెన్షన్ పెట్టినా సక్రమంగా జరుగుతాయి. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. షేర్ మార్కెట్లు లాభాలలో సాగుతాయి. ఉద్యోగులు ఇబ్బందుల నుండి బయటపడగలరు. ఉద్యోగార్థులకు అవకాశాలు దొరుకుతాయి.

## సింహం

మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

రావలసిన బాకీలు కొంత వరకు అందుతాయి. కోర్టు కేసులలో అనుకూలత, కుటుంబ సభ్యులతో చిన్న విభేదాలుంటాయి. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు. వృత్తి వ్యాపారాలందు బాగా కృషి చేస్తారు. ఆర్థిక స్థితి బాగుండి ఆదాయం బాగుంటుంది. క్రీడా శాస్త్ర సాంకేతిక రంగాల వారికి అవకాశాలుండగలవు. పెండింగ్‌లోగల పనులు కొనసాగుతాయి.

## తుల

చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

సోదర వర్గానికి మేలు జరుగుతుంది. వ్యాపార వర్గాలకు అభివృద్ధి వుండి ఆదాయం పెరుగుతుంది. పెండింగ్‌లోగల పనులు మరల కొనసాగుతాయి. రావలసిన బాకీలు కొంత లభించగలవు. దైవ సామాజిక కార్యక్రమాలలో పాల్గొంటారు. కోర్టు వ్యవహారాలలో అనుకూలత, ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. అధికారుల నుండి ఆదరణ ఉంటుంది.

## మీనం

పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఆర్థికంగా బాగుండినా అవసరాలకు ఋణం చేయవలసి వస్తుంది. అదనపు ఖర్చులు తప్పనిసరిగా ఉంటాయి. చేయుచున్న పనులకు ఆటంకాల వల్ల టెన్షన్ పడుతుంటారు. చర్మ సంబంధమైన అనారోగ్య బాధలుండవచ్చును. కుటుంబసౌఖ్యము బాగుంటుంది. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు వత్తిడులుండవచ్చును. వృత్తి వ్యాపారాలలో ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది.

# ఉత్తరకొరియాను దారికి తెచ్చిన నెల్లూరు బాంబులు

శ్రీను గల్పిక

అది వాషింగ్టన్‌లోని అమెరికా అధ్యక్షుడి శ్వేతసౌధం. అధ్యక్షుడు ఒబామా అప్పుడే డిన్నర్ ముగించి హాల్‌లోకొచ్చి టీవీ ఆన్ చేసి బిబిసి ఛానెల్ పెట్టాడు. ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్-అన్ మాట్లాడుతున్నాడు. హైడ్రోజన్ బాంబును ఈరోజే ప్రయోగించాం, విజయవంతమైంది. ఇక చూపిస్తాం అందరికీ మా తడాఖా ఏంటో... అని హెచ్చరించాడు. టీవీలో ఆ ప్రకటనను చూడగానే ఒబామాకు పై ప్రాణాలు పైనే పోయినట్లయ్యింది. ఆయనకు ముచ్చెమటలు పట్టాయి. ఉత్తరకొరియా హైడ్రోజన్ బాంబును తయారుచేసింది అమెరికాను లక్ష్యంగా చేసుకునే... అణుబాంబుకన్నా అది వందల రెట్లు శక్తివంతమైంది... వారి వద్ద హైడ్రోజన్ బాంబు ఉందంటే ప్రపంచ దేశాలన్నీ వాళ్లకు భయపడతాయి, తమను లెక్క కూడా చేయవు... ఈ సవాల్‌ను ఎట్లా అధిగమించాలా... అనే ఆలోచనలో పడ్డాడు. మంచం మీద పడుకున్నాడనే గాని ఆయనకు నిద్ర పట్టలేదు. ఒకటే టెన్షన్... మిషెల్ ఒబామా అది గమనించి... ఉత్తరకొరియా హైడ్రోజన్ బాంబును తయారు చేసిందనగానే ఎందుకంత టెన్షన్ పడుతున్నారు. ఇండియాలో గ్యాస్‌బాంబులు వదిలే మనుషులే ఉన్నారంట... ముద్దపప్పు తింటే హైడ్రోజన్‌కు మించిన పవర్‌ఫుల్ బాంబులు వేస్తారంట... ఆ విధంగా ఏదన్నా ట్రై చేయకూడదా... అని సలహా ఇచ్చింది. ఒబామాలో ఆ మాటకు కొంత టెన్షన్ తగ్గింది. ఈ విషయంలో అందరి సలహాలు తీసుకుందామంటూ అప్పటికప్పుడు అన్ని దేశాల అధినేతలకు ఫోన్ చేసి అమెరికాకు రావాలని కోరాడు.

★★★★★

న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి కార్యాలయం. ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి బాన్‌కీమూన్‌తో పాటు అమెరికా అధ్యక్షుడు ఒబామా, బ్రిటన్ ప్రధాని డేవిడ్ కామెరూన్, రష్యా అధ్యక్షుడు పుతిన్, జర్మనీ ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్, ఫ్రాన్స్ ప్రధాని హోలాండే, జపాన్ ప్రధాని షింజో అబే, భారత ప్రధాని నరేంద్రమోడీ మరికొన్ని దేశాల అధినేతలు ఉన్నారు. బాన్‌కీమూన్ అధ్యక్షోపన్యాసం చేస్తూ... ఉత్తరకొరియా హైడ్రోజన్ బాంబును తయారుచేసింది. ఇది ప్రపంచ శాంతికే ప్రమాదకరం. ఉత్తరకొరియాపై అంతర్జాతీయ సమాజమంతా ఒత్తిడి తేవాల్సివుందని చెప్పారు. ఒబామా మాట్లాడుతూ... ఎటువంటి బాంబులైనా ఉంటే గింటే అమెరికా వద్దే వుండాలి, ఇంకెవరి వద్ద బాంబులున్నా ప్రపంచశాంతికి విఘాతమే. కాబట్టి ఉత్తరకొరియా హైడ్రోజన్ బాంబును తయారుచేయకుండా అందరం కలిసి నిలదీద్దామన్నాడు. అప్పుడు రష్యా అధ్యక్షుడు పుతిన్ లేచి... బాంబులు నీ దగ్గర వుంటే శాంతి కోసం... మా దగ్గర ఉంటే అశాంతి కోసమా... నిన్ను చూసే అందరూ బాంబులు తయారుచేసుకుంటున్నారు. ఉత్తరకొరియాతో మాకెటువంటి శత్రుత్వం లేదు... వాళ్లతో మాకెటువంటి ప్రమాదం లేదు. మీ చావు మీరు చావండి అంటూ లేచాడు. చైనా అధ్యక్షుడు జింగ్ పింగ్ కూడా ఎవరి చేసుకున్న ఖర్మ వాళ్లు అనుభవించకతప్పదు కదా, ఆ బాంబు ఏదో మీరే వేయించుకుంటారో, వేసుకుంటారో మీలో మీరు చూసుకోండంటూ లేచి వెళ్లిపోయాడు. ఈ విషయంలో ఉత్తరకొరియాతో శత్రుత్వం తెచ్చుకుని ఆ హైడ్రోజన్ బాంబును మా నెత్తిన వేయించుకోలేమంటూ మిగతా దేశాల నేతలు కూడా వెళ్లిపోయారు. ఇక అక్కడ భారత ప్రధాని మోడీ మాత్రమే మిగిలాడు. ఆపదలో తోడున్నవాడే నిజమైన మిత్రుడు... మీ స్నేహం విలువ నాకు ఈరోజుకు తెలిసింది. ఈ సమయంలో మీరే నాకు దారి చూపాలంటూ ఒబామా, మోడీ చేతులు పట్టుకున్నాడు. ఒబామా భుజం తట్టి ధైర్యం చెప్పిన మోడీ, వెంటనే ఇండియాలో వున్న యం. వెంకయ్యనాయుడుకు ఫోన్ చేసి విషయం చెప్పాడు.

★★★★★

వైట్‌హౌస్‌లో ఒబామా, మోడీ, డేవిడ్‌కామెరూన్, ఏంజెలా మెర్కెల్, జింగ్ పింగ్, షింజో అబే, హోలాండ్ కూర్చుని వున్నారు. అంతలో ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్-అన్ వచ్చి ఒబామా కాళ్ల మీద పడ్డాడు. సార్, నన్ను క్షమించండి, మేము ఇక హైడ్రోజన్ బాంబుల జోలికి పోము, మా మీద ప్రయోగించిన ఆ బాంబులను విరమించుకోండి, లేకుంటే మా దేశంలో మనిషంటూ మిగలడు... అని బ్రతిమలాడసాగాడు. ఒబామా అతనిని పైకి లేపి... పిచ్చి పిచ్చి వేషాలు మానుకుని బుద్ధిగా బ్రతుకు, మళ్లీ హైడ్రోజన్ బాంబు అన్నారో... ఇదే గతి పడుతుందని హెచ్చరించి పంపాడు. ఆ సంఘటనకు మోడీ మినహా మిగతా దేశాల అధినేతలు షాకయ్యారు. అతడిని ఎలా దారికి తెచ్చారని పుతిన్ అడిగాడు. అప్పుడు ఒబామా... ఉత్తరకొరియా విషయంలో మీరంతా నాకు హ్యాండిచ్చారు. కాని మోడీ ఒక్కడే అండగా నిలిచాడు. ఆయన సహకారంతో ఉత్తర కొరియాను దారిలోకి తెచ్చానన్నాడు. ఎలా... అని జింగ్‌పింగ్ అడిగాడు. ఇలా... అంటూ ఒబామా ఫ్లాష్‌బ్యాక్‌లోకి తీసుకెళ్లాడు.

★★★★★

ఐఆర్ 20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలకు ప్రసిద్ధిగాంచిన నెల్లూరు నగరంలో కార్పొరేషన్ కార్యాలయం. ఒబామా, మోడీ, వెంకయ్య, రాజ్‌నాథ్‌సింగ్‌లు మేయర్ అబ్దుల్ అజీజ్, కలెక్టర్ జానకి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్ యాదవ్, స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకా(65)లతో సమావేశమయ్యారు. మోడీ ఉత్తరకొరియా అణుబాంబును గురించి వివరించి... ఆ దేశాన్ని అణచాలంటే మీ సహకారం కావాలని కోరారు. అప్పుడు అజీజ్... అర్థమైంది సార్, మా హైబ్రీడ్ దోమలను ఆ దేశంలో వదలాలి... మా ఒక్కో దోమ ఒక్కో హైడ్రోజన్ బాంబుతో సమానం. వాళ్ళు హైడ్రోజన్ బాంబు తయారుచేయాలంటే వందల కోట్లు ఖర్చు. ఎన్నో ఏళ్లకాలం పడుతుంది. కాని మా నెల్లూరులో గంటకు కొన్ని లక్షల దోమలనే బాంబులు పుడుతుంటాయి. ఏం ఇబ్బంది లేదు. ప్రపంచ శాంతి కోసం మేం ఆ మాత్రం చేయలేమా... మీకు ఎన్ని టన్నులు కావాలంటే అన్ని టన్నులు తీసుకెళ్లండని చెప్పాడు. ఒబామా, మోడీలు నెల్లూరు నాయకుల అందరి చేతులు పట్టుకుని... ప్రపంచ చరిత్రలో మీరు, మీ దోమలు చిరస్థాయిగా నిలిచి పోతాయంటూ కృతజ్ఞతలు చెప్పి లేచారు.

★★★★★

ఇక్కడితో ఫ్లాష్‌బ్యాక్ అయిపోయింది. ఒబామా మాట్లాడుతూ... ఉత్తరకొరియా మీద నెల్లూరు దోమలను వదిలాము. ఆ దోమల కాటుకు ఆ దేశంలో లక్షలాది మంది ప్రజలు ఆసుపత్రుల పాలయ్యారు. ఓ వారానికే పరిస్థితి ఇది... ఇంకో నెల ఆగితే ఆ దేశం మొత్తం ఆస్పత్రి పాలవుతుంది. ఈ ఘనత నాది కాదు మోడీది, మాకు నిజమైన మిత్రుడు ఆయనేనంటూ మరోసారి మోడీకి నమస్కరించాడు ఒబామా!



## కావలి కబుర్లు

### కట్టెలపొయ్యి కష్టాలు తొలగించేందుకే...

# ఉచిత వంటగ్యాస్



కట్టెల పొయ్యి ద్వారా వంట చేసే మహిళలు శ్వాసకోశ వ్యాధులకు, కంటి సంబంధిత వ్యాధులకు గురవుతున్నారని, బీద, మధ్య తరగతి మహిళల ఆరోగ్య పరిరక్షణకై ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఉచిత వంట గ్యాస్ పథకాన్ని దేశ వ్యాప్తంగా అమలు చేస్తున్నారని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కందుకూరి వెంకట సత్యనారాయణ వివరించారు. 9వ తేదీ 4వ వార్డులో ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఉపాధి కొరకు నరేంద్ర మోడీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రారంభించిందన్నారు. స్వయం ఉపాధి కొరకు ముద్రా బ్యాంకు సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

కావలి నియోజకవర్గానికి కందుకూరి వెంకటసత్యనారాయణ కృషి వల్ల 3600 ఉచిత వంటగ్యాస్ కనెక్షన్లు మంజూరు కావడం గుర్తించాల్సిన విషయమని నియోజకవర్గ ఇన్‌ఛార్జి సి.వి.సి.సత్యం కొనియాడారు. కావలి పట్టణ మరియు రూరల్ మండల పరిధిలో సుమారు 650కనెక్షన్లు మంజూరు చేయించినందుకు 4వ వార్డు భాజపా ఇన్‌ఛార్జి చెన్నా వెంకటసత్యనారాయణ కందుకూరికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కావలి పట్టణ భాజపా అధ్యక్షులు వి.వి.రంగారెడ్డి, కావలి రూరల్ మండల ఉపాధ్యక్షులు ఆర్.జయరామిరెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు తాళ్లూరి మధు, తెలుగుదేశం పార్టీ నాయకులు ద్రోణాదుల వెంకటరావు, తిరుమలశెట్టి సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికే జన్మభూమి



స్థానిక సమస్యలను పరిష్కరించుకోవడానికే జన్మభూమి కార్యక్రమం వేదికగా ఏర్పడిందని కావలి మున్సిపల్ ఇన్‌ఛార్జి ఛైర్మెన్ గుండ్లపల్లి భరత్‌కుమార్ అన్నారు. ఆదివారం టిడిపి పట్టణ కమిటి అధ్యక్షులు మల్లిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 34వ వార్డు కౌన్సిలర్ విజయలక్ష్మి అధ్యక్షతన స్థానిక ఎఎన్ఆర్ కల్యాణ మండపంలో జన్మభూమి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మున్సిపాలిటీలో జరిగే వివిధ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అనంతరం మలిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తనకు రాజకీయంగా జన్మనిచ్చిన వార్డు ప్రజల రుణం తీర్చుకుంటానని అన్నారు. జన్మభూమి కార్యక్రమం ద్వారా వార్డుల్లో అభివృద్ధి జరుగుతుందన్నారు. టిడిపి ప్రధాన కార్యదర్శి అమరా వేదగిరి మాట్లాడుతూ రాజధాని నిర్మాణ కమిటి సభ్యులు, మాజీశాసనసభ్యులు బీద మస్తాన్‌రావు నేతృత్వంలో పేదప్రజలకు పక్కాఇళ్ళు మంజూరైనాయన్నారు. ముందుగా జన్మభూమి ప్రతిజ్ఞ చేయించిన కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు చంద్రబాబునాయుడు సందేశాన్ని చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో జ్యోతిబాబూరావు, వెంకట్రావు, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.






# పద్య కళకు.. కొత్త వెలుగు




- తిక్కన పుట్టిన గడ్డపై మహాద్భుతంగా మహాభారత ఉపన్యాసాలు
- తెలుగు భాషామతల్లి సేవలో పద్యకళా పరిషత్



నెల్లూరులో పద్యకళా పరిషత్ ఆవిర్భావం పద్య కళకు కొత్త వెలుగులు తెస్తోంది. గత పదేళ్ళుగా ఈ సంస్థ తెలుగు సారస్వతానికి, ప్రబంధాలకు, ప్రత్యేకించి పద్య కళకు ప్రాధాన్యత ఇస్తూ, భాషాభిమానులందరూ ఆనందించేలా తెలుగువెలుగులను మరింతగా ద్విగుణీకృతం చేస్తోంది. తిక్కన పుట్టిన గడ్డపై మహాద్భుతంగా మహాభారత ఉపన్యాసాలను ఏర్పాటు చేస్తూ ఆ మహా ఇతిహాసానికి సుమనోహరమైన భాషామాలికలు కట్టి భక్తితో అర్చిస్తోంది. 2007 జనవరిలో ప్రారంభమైన పద్య కళాపరిషత్ మొదటి మూడేళ్ళలో పౌరాణిక స్త్రీ పాత్రల ప్రాధాన్యతను కన్నులకు కడుతూ పలు కార్యక్రమాలు నిర్వహించింది. ఆ తర్వాత, మనుచరిత్రము, వసుచరిత్రము, పారిజాతాపహరణము వంటి అనేక ప్రబంధాలపై సుప్రసిద్ధులైన సారస్వతవేత్తలచే ఉపన్యాసాలు ఏర్పాటుచేసింది. గత ఏడు సంవత్సరాలుగా మహాభారతంపై ప్రముఖ ఉపన్యాసకులచే ఉపన్యాసాలు ఏర్పాటుచేసి అందరికీ మహాభారత వైశిష్ట్యాన్ని సుబోధకం చేస్తోంది. అందులోనూ మహాభారతాన్ని ఆంధ్రీకరించి తెలుగు భాషామతల్లికి కంఠహారంగా సమర్పించిన మహాకవి తిక్కన పుట్టిన ఈ నెల్లూరు సీమలో మానవ జీవితాలకు..వారిలోని అన్ని దృక్కోణాలకు దర్పణం పట్టే మహాభారతేతిహాసాన్ని నేటి తరం వారికి కూడా బాగాఅవగాహన కలిగించేలా మహాభారత ఉపన్యాసాలను ఏర్పాటు చేసి, పద్యకళా పరిషత్ తన ప్రత్యేకతను చాటుకుంటోంది. పద్యకళకు పట్టాభిషేకం చేస్తూ పద్య పఠనాన్ని ప్రోత్సహిస్తూ అందరి ప్రశంసలూ అందుకుంటోంది.





## సుప్రసిద్ధ ఉపన్యాసకులతో మహాభారత ఉపన్యాసాలు :

పద్యకళాపరిషత్ వారు 2010 నుంచి మహాభారత ఉపన్యాసాలపై దృష్టి సారించారు. సారస్వతవేత్తలను ఇక్కడికి ఆహ్వానించి నెల్లూరీయులకు మహాభారతం పట్ల వున్న ఆరాధనను ద్విగుణీకృతం చేస్తూ భారతంలోని వివిధ పర్వాలను శ్రోతలకు వివరించే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. 2010 నుంచి 2016 దాకా జరిగిన ఈ మహాభారత ఉపన్యాసాల్లో సుప్రసిద్ధ సారస్వతవేత్తలెందరో పాల్గొని మహాభారతంలోని ప్రతి పర్వాన్నీ శ్రోతలందరికీ బాగా అర్థమయ్యేవిధంగా ఆమూలాగ్రంగా వివరించారు. ఈ అత్యుత్తమ భాషా సేవలో ఆదిపర్వం నుంచి సభా పర్వం దాకా ఉపన్యాసకులు తమదైన ఉపన్యాసశైలిలో అందరినీ ఆకట్టుకున్నారు. పండితకవులు శ్రీ సముద్రాల లక్ష్మణయ్య, బత్తిన సాయికుమార్‌రెడ్డి, చీమకుర్తి వెంకటేశ్వరరావు, కడిమెళ్ళ వరప్రసాద్, మోపూరు వేణుగోపాలయ్య ఇప్పటిదాకా మహాభారతంలోని ఆదిపర్వం విశిష్టతను వివరించగా, శ్రీ మల్లాప్రగఢ శ్రీమన్నారాయణమూర్తి సభాపర్వాన్ని సుబోధకం చేశారు. అదేవిధంగా బూదాటి వెంకటేశ్వర్లు, సంగనభట్ల నరసయ్య, అప్పజోడు వెంకట సుబ్బయ్య, శ్రీమతి పాతూరి అన్నపూర్ణ, ఆలూరి శిరోమణివర్మ, నేలనూతల శ్రీనివాసమూర్తి, అవధాన చక్రవర్తి మేడసాని మోహన్ అరణ్యపర్వంపై అత్యద్భుతంగా ఉపన్యసించారు. పద్యకళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్, మోపూరు వేణుగోపాలయ్య ఇరువురూ విరాట పర్వాన్ని వివరించగా, మేడసాని మోహన్ ఉద్యోగపర్వంపై ఉపన్యసించారు. మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి భీష్మపర్వాన్ని, సంగనభట్ల నరసయ్య ద్రోణ పర్వాన్ని, తుమ్మపూడి కోటేశ్వరరావు కర్ణపర్వాన్ని, మేడసాని మోహన్ శల్యపర్వం-సౌప్తిక పర్వాలను, శ్రీమతి కె.గిరిజాలక్ష్మి స్త్రీ పర్వాన్ని, మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి, కోటా వెంకటనరసింహంలు శాంతిపర్వాన్ని, సుప్రసిద్ధ ఉపన్యాసకులు శ్రీ శలాక రఘునాధశర్మ అనుశాసనిక పర్వాన్ని వివరించారు. శ్రీ కేశాప్రగడ సత్యనారాయణ అశ్వమేధ పర్వాన్ని, మేడసాని మోహన్, మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తిలు ఆశ్రమవాస పర్వాన్ని వివరించగా, జి. దామోదరనాయుడు మౌసల పర్వాన్ని, మహాప్రస్థానపర్వాన్ని వివరించారు. స్వర్గారోహణ పర్వాన్ని మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి వివరించారు.

తెలుగు సాహిత్య చరిత్రలో ఒకనాడు విశిష్టస్థానాన్ని సాధించుకున్న పద్య కళాప్రక్రియ నానాటికీ కనుమరుగైపోతున్న ప్రస్తుత తరుణంలో, ఆ కళను తిరిగి పునరుజ్జీవింపజేసి తెలుగు జాతి సాహితీ సంస్కృతులను దీప్తివంతం చేయాలన్న పద్యకళా పరిషత్ ఆశయానికి తగ్గట్టుగా క్రమం తప్పకుండా, ఎంతో వ్యయప్రయాసలతో ఈ కార్యక్రమాలను నిర్వహించడం అద్భుతం.. అపూర్వం. అందుకు కంకణం కట్టుకున్న పద్య కళాపరిషత్ కార్యవర్గం, ముఖ్యంగా అధ్యక్షుడు శ్రీ మెట్టు రామచంద్రప్రసాద్ తదితరులంతా అభినందనీయులే.

## ఆకట్టుకున్న పద్య కళా ఉత్సవాలు :

తాజాగా ఈనెల 6 నుంచి 10వతేది వరకు ఆంధ్రమహాభారత ఉపన్యాసాలు మరింత వైభవంగా జరిగాయి. ఇవి పద్య కళా ఉత్సవాలు అన్నట్లుగా అందరినీ అలరించాయి. నెల్లూరు టౌన్‌హాలు వేదికగా, అత్యంత వేడుకగా జరిగిన ఈ ఉపన్యాసాలు తెలుగుతల్లిని భాషాసుమాలతో అర్చించినట్లుగా భాసించాయి. తొలుత అందరూ కలసి మహాకవి తిక్కన చిత్రపటానికి పూల మాలికలు సమర్పించారు. అనంతరం ఉపన్యాసాలు ప్రారంభమయ్యాయి. 6వ తేదిన డా. మేడసాని మోహన్ ఆశ్రమవాస పర్వం ప్రథమాశ్వాసాన్ని వివరించగా, 7న మల్లాప్రగడవారు ఆ పర్వంలోని ద్వితీయాశ్వాసాన్ని, 8,9 తేదీల్లో ఆచార్య గార్లపాటి దామోదరనాయుడు మౌసల పర్వం, మహాప్రస్థానిక పర్వాల్లోని విశేషాలను, వైశిష్ట్యాన్ని అందరికీ అర్థమయ్యేవిధంగా తెలియజేశారు. చివరిరోజైన 10వ తేదీన మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి స్వర్గారోహణ పర్వాన్ని శ్రోతలకు ఆద్యంతం అద్భుతంగా వివరించారు. స్వర్గీయ నలుబోలు మల్లయ్యనాయుడు స్మృత్యంకంగా ఆయన కుమారుడు నలుబోలు బలరామయ్య నాయుడు ఈ కార్యక్రమానికి సభాపోషకులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా పౌరాణిక పద్యాలను ఆలపించిన మనుబోలు ప్రభాకరరావు, రామయ్య, పౌలు, హార్మోనిస్టు రామకృష్ణలను పద్యకళా పరిషత్‌వారు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి 'లాయర్' వారపత్రిక సంగ్రాహకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి అధ్యక్షత వహించారు. వచ్చే ఏడాది జనవరిలో పద్యకళా పరిషత్ నిర్వహించే కార్యక్రమాల్లో పద్యాలను ఆలపించే కళాకారులు పాత్రోచిత వేషధారణతో పద్యాలు ఆలపిస్తే ఆ అయిదుగురికి ఆయా వేషధారణల కోసం వెయ్యి రూపాయలతో పాటు, తన తండ్రి స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డి స్మారకార్థం మరో వెయ్యి రూపాయల వంతున వారికి ప్రోత్సాహకంగా అందజేస్తామని ఆయన అందరి కరతాళధ్వనుల మధ్య ప్రకటించారు. అనంతరం మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తిని, తుంగా శివప్రభాత్‌రెడ్డిని పద్య కళాపరిషత్ వారు ఘనంగా సత్కరించారు. సంస్థ కోశాధికారి బివి నరసింహం ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా, ఆ సంస్థ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్, కార్యదర్శి మోపూరు వేణుగోపాలయ్య, సంయుక్త కార్యదర్శి సిహెచ్ వెంకటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు కె.సుందరరామయ్య, పి.వెంకటేశ్వర్లు, ఎన్ బలరామయ్యనాయుడులతో పాటు, పంచాగ్నుల వెంకటవిశ్వనాథం, వల్లకవి వెంకటసుబ్బారావు, వొమ్మిన సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ అయిదురోజుల పాటు ప్రముఖ రంగస్థల కళాకారుడు పద్మనాభరాజు వీనుల విందుగా పద్యపఠనం చేసి అందరినీ అలరించారు.

# తమ్ముడిని వద్దని... అన్నను చేర్చుకుంటున్నారు


గతంలో ఆనం సోదరులలో ఐదవ తమ్ముడని రాష్ట్ర ఎడిబుల్ ఆయిల్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సన్నపరెడ్డి పెంచలరెడ్డికి పేరుండేది. స్టోన్‌హౌస్‌పేట, పప్పులవీధిలలోని వ్యాపార వర్గాలలో పట్టున్న నాయకుడు పెంచలరెడ్డి. ఆనం వారి ఇలాకాలో పెంచలరెడ్డి హవా బాగానే నడిచింది. అయితే పెంచలరెడ్డి ఆనం సోదరులను ఎంతగా అభిమానించేవాడో వై.యస్.రాజశేఖరరెడ్డిని అంతకంటే ఎక్కువ అభిమానించేవాడు. 2014 ఎన్నికలకు ముందు ఆనం సోదరులు జగన్‌ను తిట్టడం, వై.యస్.పైనే ఆరోపణలు చేయడం వంటివి ఆయనకు నచ్చలేదు. అదీగాక ఆనం వివేకాకు కొన్ని విషయాలకు సంబంధించి మనస్పర్థలు వచ్చాయి. 2014ఎన్నికలప్పుడే ఆనంను వదిలి పెంచలరెడ్డి వైకాపాలో చేరిపోయాడు. ఆ సమయంలోనే ఆయనకు సంబంధించిన ఆస్తులపై ప్రతీకార దాడులు జరిగాయి.

ఇప్పుడు ఆనం గూడు విడిచివెళ్లిన పక్షులన్నీ తిరిగి ఒక్కొక్కటిగా అదే గూటికి చేరుకుంటున్నాయి. సన్నపరెడ్డి పెంచలరెడ్డిని కూడా ఆనం సోదరులు మళ్ళీ దగ్గర చేర్చుకుంటారని భావిస్తున్న తరుణంలో వివేకా అనూహ్యంగా పెంచలరెడ్డి అన్న అయిన సుబ్బారెడ్డిని దగ్గర చేర్చుకున్నాడు. సుబ్బారెడ్డికి పెంచలరెడ్డికి పడదు. పెంచలరెడ్డిని వివేకా దూరం పెట్టేందుకే తనకు పడని సుబ్బారెడ్డిని తనవైపుకు లాక్కున్నట్లు తెలుస్తోంది. 2014లో పెంచలరెడ్డి తమతో ఉండకుండా వెళ్లిపోయాడనే కోపంతోనే వివేకా ఇలా చేసాడని సమాచారం. సుబ్బారెడ్డి కూడా వైసిపిలో తగిన గౌరవం లేదని సాకు చెప్పి వివేకా నాయకత్వంలో తెలుగుదేశంలో చేరుతానంటున్నాడు.

# టిఎన్‌టియుసి నూతన కార్యవర్గం

తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ జిల్లా కార్యవర్గాన్ని సోమవారం టిడిపి జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా బచ్చు శ్రీనివాసులు (వాసు), ప్రధాన కార్యదర్శులుగా పఠాన్‌బాషా, ఎన్‌వి సుకుమార్, పి.ప్రసాద్‌రెడ్డి, కోశాధికారిగా షేక్ జాకీర్‌హుస్సేన్, కార్యాలయ కార్యదర్శిగా ఎం.కిరణ్‌కుమార్, ప్రచార కార్యదర్శిగా వి.సుధాకరరావులను నియమించారు. వీరితోపాటు నలుగురు ఉపాధ్యక్షులు, మరో నలుగురు కార్యనిర్వాహక కార్యదర్శులు, అయిదుగురు కార్యదర్శులను కూడా నియమించారు.

# గర్భసంచిలో 20 కిలోల కణితి



ఓ మహిళ గర్భసంచిలో ఏర్పడ్డ 20కిలోల కణితిని తొలగించి రోగిని పూర్తిగా కోలుకునేలా చేసారు నెల్లూరులోని దీప్తి నర్సింగ్ హోమ్‌కు చెందిన డాక్టర్ ఎస్.లోకనాథం, డాక్టర్ ఎస్.సుమతిలు. విడవలూరు మండలం వీరారెడ్డిపాలెంకు చెందిన నాగభూషణమ్మ(55) అనే మహిళ తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతూ దీప్తి నర్సింగ్ హోమ్‌కు వచ్చింది. డాక్టర్ లోకనాథం, డాక్టర్ సుమతిలు ఆమెకు పరీక్షలు నిర్వహించి గర్భసంచిలో ఫైబ్రాయిడ్ వున్నట్లు గుర్తించారు.

ఈ నెల 9వ తేదీన శస్త్రచికిత్స ద్వారా గర్భసంచిలో వున్న 20కిలోల కణితిని తొలగించారు. సాధారణంగా 25-40 ఏళ్లలోపు మహిళలో ఫైబ్రాయిడ్‌లు ఏర్పడుతుంటాయని, 55 ఏళ్ల వయసు మహిళల్లో ఈ పరిణామంలో ఏర్పడడం మొదటిసారి చూస్తున్నామని డాక్టర్ లోక్‌నాథం తెలిపారు. 40ఏళ్లు దాటిన ప్రతి మహిళ ఏడాదికి ఒకసారైనా వైద్య పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ సుమతి కోరారు.

# ఆక్రమణల తొలగింపు సాధ్యమయ్యేనా?

(మొదటి పేజీ తరువాయి)

తొలగింపుకు గట్టిగానే ఆదేశాలిచ్చారు. అప్పటికప్పుడు ఇతర జిల్లాల నుండి సర్వేయర్‌లను తీసుకొచ్చి కాలువల ఆక్రమణలను మార్కింగ్ చేయించారు. పంట కాలువల ఆక్రమణల జాబితాలో సామాన్యుల ఇళ్ళే కాదు పలు హోటళ్ళు, వాణిజ్య భవనాలు, అపార్ట్‌మెంట్లు కూడా వున్నాయి. ఆక్రమణల తొలగింపు చేపడితే 5వేల ఇళ్లను లేపాల్సి ఉంటుంది. వీరెవరికీ నెల్లూరురూరల్ మండలంలోని అక్కచెరువుపాడు వద్ద స్థలాలు కేటాయించి, ఇళ్లు నిర్మించాలని చూస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లలో రాష్ట్ర ప్రభుత్వం 10వేల ఇళ్లను నెల్లూరుజిల్లాకు మంజూరు చేసింది. అయితే ఆక్రమణల తొలగింపు బాధితుల కోసం మరో 5వేల ఇళ్లను అదనంగా కేటాయించనున్నట్లు తెలుస్తోంది. చంద్రబాబునగర్, వై.యస్.నగర్‌లలోకి వెళ్లడానికి బాధితులు ఇష్టపడడం లేదు. ఈ కాలనీలు ఏర్పడి ఏళ్లవుతున్నా ఇంతవరకు అక్కడ ఎలాంటి మౌలిక వసతులు లేవు. అధికారులు ఖాళీ స్థలాలు చూపించి అక్కడ రోడ్లు, నీళ్లు, లైట్లు, డ్రైనేజీ వంటి కనీస వసతులు కల్పించక పోతుండడం వల్లే ఆ కాలనీలకు ఎవరూ పోవడం లేదు.

బాధితులకు ప్రత్యామ్నాయం చూపిస్తామని, ఈ నెల 25వ తేదీ నుండి ఆక్రమణల తొలగింపు చేపడుతామని మున్సిపల్ మంత్రి పి.నారాయణ ఘంటాపథంగా చెబుతున్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలేమో బాధితులకు ప్రత్యామ్నాయం చూపించడమే కాక మంత్రిగారి విద్యాసంస్థ ఆక్రమణలు తొలగించాకే ఇతర ఆక్రమణల జోలికి పోవాలని హెచ్చరిస్తున్నారు. ఆక్రమణల తొలగింపు చేపట్టడం జరిగితే మొదట ఆక్రమణ నుండి చివరి ఆక్రమణ దాకా తొలగిస్తేనే ఆక్రమణల తొలగింపుకు సార్థకత వుంటుంది. ఒక్క శాతం ఆక్రమణల తొలగింపు ఆగిపోయినా దాని ప్రయోజనం నెరవేరదు. నగరంలో ఆక్రమణల తొలగింపు పెద్ద యజ్ఞమే. మరి ఎంతవరకు జరుగుతుందో చూడాలి.

# రేషన్ కార్డుల్లో తప్పులను సరిచేయండి

**- ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్**



నెల్లూరు నగరంలోని 9వ డివిజన్‌లోని పత్తివారి ప్రాథమిక పాఠశాలలో జరిగిన జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో నెల్లూరు నగర శాసనసభ్యులు డా॥ పి.అనిల్‌కుమార్‌యాదవ్ పాల్గొని పింఛన్ దారులకు పింఛన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డా॥ పి.అనిల్ మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీల వారు పింఛన్‌లకు, రేషన్‌కార్డులకు వెళ్లినప్పుడు పనులు కాకపోవడంతో కార్పొరేటర్లు అందరూ బాధపడుతున్నారని, పెన్షన్‌ల దగ్గర చొరవ చూపి రాజకీయ పార్టీలకు అతీతంగా పెన్షన్‌లు మంజూరు చేయాలని కోరుతున్నానన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఒక ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేసి అర్హులైన వారు అక్కడకు రేషన్, ఆధార్‌కార్డుతో వచ్చి దరఖాస్తు చేసుకున్న వెంటనే వారిని ఎటువంటి ఇబ్బందులకు గురిచేయకుండా పెన్షన్ మంజూరు చేసే విధంగా ఉండాలన్నారు. ఇదే విషయమై ప్రభుత్వానికి అధికారపార్టీ నాయకులు సూచిస్తే బాగుంటుందని అన్నారు. కొత్త కార్డుల్లో వున్న తప్పులను వెంటనే సవరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపీ మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ పి.రూప్ కుమార్‌యాదవ్, కార్పొరేటర్లు దామవరపు రాజశేఖర్, ఊటుకూరు మాధవయ్య, గోగుల నాగరాజు, దేవరకొండ అశోక్, నాయకులు వేలూరు మహేష్, తిప్పిరెడ్డి రాఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'కోట' శివరామయ్య స్మారక ఛాంపియన్‌లుగా

# శ్రీకాంత్, ప్రదీప్




ఈ నెల 9, 10తేదీలలో నెల్లూరు రంగనాయకులపేటలో నిర్వహించిన కోట శివరామయ్య మెమోరియల్ ట్రోఫీ-2016 షటిల్ బ్యాడ్మింటన్ పోటీలలో గాదంశెట్టి శ్రీకాంత్, ముల్లంగి ప్రదీప్‌లు విజేతలుగా నిలిచారు. హోరాహోరీగా జరిగిన ఫైనల్స్‌లో పొదలకూరు టీమ్ చైతన్య, ప్రదీప్‌లపై వీరు విజయం సాధించారు. అలాగే సురేంద్ర, తిలక్‌లు రన్నర్స్‌గా నిలిచారు. 10వ తేదీ జరిగిన ముగింపు కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్ పాల్గొని విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రోఫీ నిర్వాహకులు కోట గురుబ్రహ్మం, కోట సత్యనారాయణ, కోట సూర్యనారాయణ, కోట రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# కనిపించని 'ఆనం'దం

(మొదటి పేజీ తరువాయి)

అలా చూపడానికి తమ అనుచరులను నెల్లూరు నుండి విజయవాడకు తీసుకెళుతున్నారు. చంద్రబాబుకు తమ బలం చూపించబోతున్నారు. అందుకు ముందుగానే వాళ్లు పెద్దఎత్తున జన సమీకరణ ప్రయత్నాలు చేస్తున్నారు.

అయితే బలప్రదర్శన విషయంలో ఆనం సోదరులకు వారి సొంత సోదరుల నుండే సహాయ నిరాకరణ ఎదురవుతోంది. సోదరులలో మూడోవాడైన ఆనం జయకుమార్‌రెడ్డి 2014 ఎన్నికలకు ముందే ఆనం వివేకాతో విభేధించి కాంగ్రెస్ నుండి బయటకు వచ్చాడు. అప్పుడు వైకాపాలో చేరాలని చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టి జైసమైక్యాంధ్ర పార్టీలో చేరాడు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కూడా పని చేశారు. ఎన్నికల తర్వాత తెలుగుదేశం పార్టీలో చేరాడు. ఇటీవల తన సోదరులు వివేకా, రామనారాయణరెడ్డిలు తెలుగుదేశంలోనే చేరినా ఆయన మాత్రం వారితో కలవడం లేదు. ఇక నాలుగో సోదరుడైన ఆనం విజయకుమార్‌రెడ్డి ఇప్పటివరకు తన అన్నలతోనే వున్నాడు. ఇప్పుడు మాత్రం తన అన్నల వెంట తెలుగుదేశంలో చేరే విషయంలో నిర్ణయం తీసుకోలేదు. ఆ పార్టీలో చేరడానికి ఆయన మనసాక్షి ఒప్పుకుంటున్నట్లు లేదు. తన రాజకీయ భవిష్యత్‌పై ఆయన సొంత అనుచరులతో కూడా సమావేశాలు జరిపారు. ఈ నెల 17వ తేదీ అయితే మాత్రం తన అన్నల వెంట విజయవాడకు వెళ్లే అవకాశాలు కనిపించడం లేదు.

ఇక జిల్లా తెలుగుదేశం నాయకులు కూడా ఆనం రాకపట్ల అంత ఆనందంగా లేరు. నెల్లూరు పార్లమెంటుతో పాటు రూరల్ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఇప్పటికే తన అనుచరులుకు హుకుం జారీ చేసినట్లు తెలుస్తోంది.

అయితే నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఒక సందిగ్ధ రాజకీయ పరిస్థితి నెలకొంది. 2014 ఎన్నికలప్పుడే రూరల్ సీటు బీజేపీకివ్వడంతో చాలామంది కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు తెలుగుదేశంలోకి కాకుండా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కొద్దిమంది మాత్రం ఆరోజు తెలుగుదేశం పార్లమెంటు అభ్యర్థిగా వున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి వైపు నిలిచారు. రూరల్ పరిధిలోని గ్రామాల్లో వున్న కాంగ్రెస్ కేడర్ అంతా కూడా వైకాపాకు, టిడిపికి వెళ్లిపోయింది. ఇప్పుడు ఆనం సోదరులు తమ అనుచరులను కూడా తెలుగుదేశంలో చేర్చాలని చెప్పి అందర్నీ విజయవాడకు పిలుస్తున్నారు. రూరల్‌లో వైకాపా నుండి పెద్దగా పోవడం లేదు. ఇక తెలుగుదేశంలో వుండే వాళ్లు ఎలాగూ ఆదాల నాయకత్వంలో వున్నారు. ఇప్పుడు వాళ్లను కొత్తగా పార్టీలో చేర్చేదేముంది. ఆదాల కూడా తన అనుచరులకు ఇదే చెబుతూ ఎవరన్నా నన్ను కాదని ఆనం సోదరుల వెంట వెళ్లారో... అంతే సంగతులని వార్నింగ్ టైపులో చెబుతున్నట్లు సమాచారం.

ఆత్మకూరు నియోజకవర్గంలో చూస్తే ఇన్‌ఛార్జ్‌గా వున్న కన్నబాబుకు వీరి రాక కంటగింపుగా వుంది. ఆయన ఇప్పటికే ఆనం వ్యతిరేక శిబిరాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. ఆనంకు వ్యతిరేకంగా బహిరంగంగానే ప్రకటనలిప్పిస్తున్నాడు. జిల్లా నాయకులలో చూస్తే సోమిరెడ్డికి, బీద రవిచంద్రకు వీళ్లు రావడం ఇష్టం లేదు. కాని అధినేత ఆజ్ఞలకు లోబడి తలాడించక తప్పలేదు. పార్టీ ప్రతిపక్షంలో వున్నప్పుడు చొక్కా, ఫ్యాంటు చించుకుని పనిచేసిన కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అయితే బహిరంగంగానే ఆనం వ్యతిరేక జెండా పడుతున్నాడు. ఆనం వివేకా నుండి వచ్చిన ఫోన్‌కాల్‌కు కూడా కోటంరెడ్డి సరిగా స్పందించలేదని సమాచారం.

మేయర్ అబ్దుల్ అజీజ్‌దైతే విచిత్ర పరిస్థితి. కార్పొరేషన్ వ్యవహారాలలో జిల్లాలోని తెలుగుదేశం నాయకులెవరూ వేలు పెట్టడం లేదు. ఎవరికీ అంత అనుభవం కూడా లేదు. కాబట్టి అజీజ్‌కు హాయిగా వుంది. రేపట్నుండి వివేకా మొదటి వేలు పెట్టేది కార్పొరేషన్‌లోనే! గెలికేది కూడా అజీజ్‌నే! కార్పొరేషన్ మీద వివేకాకున్న అనుభవం అలాంటిది. వివేకా టీడీపీలో చేరడం అజీజ్‌కు షాకే! మంత్రి పి.నారాయణ తప్పితే మిగతా తెలుగుదేశం నాయకులెవరూ ఆనం సోదరులను చేర్చుకోవడానికి సుముఖంగా లేకపోయినా వీరి ఇష్టాలు, కష్టాలతో పని లేకుండా ఆ తంతు జరిగిపోయింది.

కనీసం తమ అనుచరులను కట్టడి చేసుకోవడం ద్వారా ఆనం సోదరుల బలంపై చంద్రబాబు అతిగా వేసుకున్న అంచనాలను తప్పని నిరూపించాలనే పట్టుదలతో ఈ నాయకులంతా వున్నారు. ఆనం సోదరులు ఛలో విజయవాడ అని పిలుపునిస్తుంటే... వీళ్లంతా నో విజయవాడ అని తమ వాళ్లకు చెబుతున్నారు. ఆనం సోదరులు ఇప్పుడే వీరికి కొరుకుడు పడకుండా వుంటే ముందు ముందు పార్టీలో పరిస్థితి ఇంకెంత తీవ్రంగా వుంటుందో?




# సిఎంఆర్‌లో కానుకల సందడి

క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి పండుగలను పురస్కరించుకుని నెల్లూరు నగరంలోని కనకమహల్ సెంటర్‌లో వున్న సిఎంఆర్ షాపింగ్‌మాల్‌లో సోమవారం రాత్రి 5వ వీక్లీ డ్రా జరిగింది. మాజీ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి వీక్లీ డ్రాను, మాజీ కార్పొరేటర్ పిండి సురేష్ డైలీ డ్రాను తీశారు. వీక్లీ డ్రాలో వేజర్లకు చెందిన ఎన్.నరసింహారెడ్డి (కూపన్ నం. 134371) గెలుపొందారు. విజేతకు మోటార్ సైకిల్ బహుమతి లభించింది. అదేవిధంగా, డైలీ డ్రాలో 5 గ్రైండర్లను విజేతలకు అందజేశారు. జి.లక్ష్మీ (కూపన్ నం. 177642-బుచ్చి), ఎల్.సాయికృష్ణా రెడ్డి (176048-నెల్లూరు వేదాయపాళెం), జయశ్రీ (178763-నెల్లూరు మూలాపేట), ఎల్.సాయికృష్ణారెడ్డి (176057-నెల్లూరు వేదాయపాళెం), కె.సుబ్రహ్మణ్యం (178613-నాయుడుపేట)లు బహుమతులు అందుకున్నవారిలో వున్నారు. ఈ సందర్భంగా ఆనం వివేకా మాట్లాడుతూ, సిఎంఆర్-చందన వారు వినియోగదారులకు అతి తక్కువ ధరలతో నాణ్యమైన వస్త్రాలను, మేలిమి బంగారు వెండి ఆభరణాలను అందించడం సంతోషదాయకమన్నారు. సిఎంఆర్-చందన అధినేత మావూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ, గత రెండు దశాబ్దాలుగా తమ షాపింగ్ మాల్స్ వినియోగదారుల ఆదరాభిమానాలు చూరగొంటున్నాయని అంటూ వినియోగదారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాజీయాడ్స్ అధినేత మోపూరు పెంచలయ్య, శైలేష్, బర్నాబాస్ తది తరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గత వారం వీక్లీ డ్రా విజేత స్రవంతికి మోటార్ బైక్‌ని బహుమతిగా అందజేశారు. ఆనం వివేకా మోటార్ బైక్ కీని విజేతకు అందజేశారు.

# కోడి పందేలకు సై అంటున్న పోలంరెడ్డి



సంక్రాంతికి కోడి పందేలు, ఎడ్ల పందేలు లేకపోతే పండుగ మజా ఏముంటుందంటున్నాడు కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి. ఆదివారం కోవూరు మండలం పడుగుపాడులో నిర్వహించిన జన్మభూమి సభలో ఆయన ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాల గురించి చెప్పాక కోళ్ల పందేలపై తన మనసులోని మాటను బయటపెట్టాడు. సంక్రాంతి పండుగను సరదాగా జరుపుకోవాలంటే కోడి, ఎడ్ల పందేలు ఉండాలని అభిప్రాయపడ్డాడు. తమిళనాడులో జల్లికట్టుకు అనుమతి నిచ్చినట్లే మన రాష్ట్రంలో కూడా కోడి పందేలకు పర్మిషన్ ఇవ్వాలని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రితో కూడా మాట్లాడాలనుకుంటున్నానని ఆయన చెప్పుకొచ్చాడు. పండుగల్లో పందేలు ఆడుతున్న వారిపై దాడులు చేయొద్దని ఆయన పోలీసులను కోరారు. కోడిపందేలపై ఇంత శ్రద్ధ చూపుతున్న పోలంరెడ్డి... కొంపదీసి సంక్రాంతి పందేల కోసం కోడిపుంజులను పెంచడం లేదు కదా!

## పోలీసు కుటుంబానికి ఆర్థిక సాయం



నెల్లూరులో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన హెడ్‌కానిస్టేబుల్ ఎం.బాలాజీసింగ్ కుటుంబానికి రావాల్సిన లక్ష రూపాయల బీమా చెక్కును సోమవారం ఏఎస్పీ రెడ్డి గంగాధర్ వారి కుటుంబసభ్యులకు ఉమేష్‌చంద్ర పోలీస్ మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్లో అందజేశారు. బాలాజీ సింగ్ భార్య అరుణబాయి ఈ చెక్కును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎ రాజశేఖర్, సిబ్బంది సులోచన, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


# 21వ వర్ధంతి



## స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డి

వ్యవస్థాపకులు
లాయర్
తెలుగు వారపత్రిక

జననం: 08-11-1930 | మరణం: 18-01-1995

మహనీయుని మహాత్మకు మా నివాళి.

లాయర్ సిబ్బంది | కుటుంబసభ్యులు


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com